VASANTH KUMAR
Director
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K, U.S.A., New Zealand)
AAERI
QEAC No. E334

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 108, పేజీలు - 08
మంగళవారం, సెప్టెంబర్ 23, 2025 వెల: 5 రూ/.

Host On Your Domain
Hosting / Admin Panel
Page Builder / Social Links
Responsive Design
Advertisement Spaces
Search Engine Optimization
XML Sitemap
Automatic Software Updates
Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456



## బీహార్ ఎన్నికలకు కసరత్తు

**- నవంబరులో మూడు దశల్లో పోలింగ్**




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** బిహార్ శాసనసభ ఎన్నికలకు త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయనుంది. ఈ ఎన్నికలను మూడు దశల్లోనే నిర్వహించే ఆలోచనలో ఈసీ ఉన్నట్టు తెలుస్తోంది. అక్టోబరు 28న ఛట్‌పూజ ముగిసిన అనంతరం పోలింగ్ ప్రక్రియ మొదలయ్యే

2లో..

## పైలట్లను టార్గెట్ చేస్తారా.?

**- ఎయిరిండియా క్రాష్ రిపోర్ట్ పై సుప్రీం ఫైర్**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అహ్మదాబాద్‌లో 260 మంది ప్రాణాలను బలిగొన్న ఎయిరిండియా విమానం ఏఐ 171 ప్రమాద ఘటనలో 'పైలట్ తప్పిదం' అంటూ జరుగుతున్న ప్రచారాన్ని సుప్రీంకోర్టు 'చాలా దురదృష్టకరం' అని వ్యాఖ్యానించింది. ఈ దుర్ఘటనపై

2లో..

## పాలస్తీనా దేశం అనేదే ఉండదు

**- తేల్చిచెప్పిన ఇజ్రాయెల్**



టెహ్రాన్ (ప్రశ్న న్యూస్) పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ ప్రభుత్వం సంచలన ప్రకటన చేసింది. జోర్డాన్ నదికి పశ్చిమ ప్రాంతంలో పాలస్తీనా దేశం అనేదే ఉండబోదని తేల్చిచెప్పింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్

2లో..



# సింగరేణి కార్మికులకు 34 శాతం బోనస్

## దసరా బోనస్ ప్రకటించిన ప్రభుత్వం

- ఒక్కో కార్మికుడికి రూ. 1,95,610 పంపిణీకి నిర్ణయం
- మొత్తంగా రూ. 819 కోట్లు విడుదల చేయనున్నట్లు ప్రకటన
- 71 వేల మంది శాశ్వత, కాంట్రాక్టు కార్మికులకు లబ్ధి
- సంస్థ లాభాల్లో 34 శాతం వాటాగా బోనస్ చెల్లింపు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం దసరా బోనస్ ప్రకటించింది. సింగరేణి లాభాల్లో 34 శాతం బోనస్ (రూ.819 కోట్లు)ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. సింగరేణి 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాలలో కార్మికులకు వాటా ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దసరా పండుగ సందర్భంగా సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటించారు. రెగ్యులర్ కార్మికులకు రూ.1,95,610 బోనస్ ప్రకటించగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 బోనస్

2లో..

## యుద్ధం అక్కర్లేదు..

## పీవోకే మనదే అవుతుంది

**భారతీయ సమాజాన్ని ఉద్దేశించి రాజ్ నాథ్ ప్రసంగం**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను స్వాధీనం చేసుకునేందుకు యుద్ధం చేయాల్సిన అవసరం లేదని, అది తనంతట తానుగానే భారత్‌లో విలీనం అవుతుందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ధీమా వ్యక్తం చేశారు. పీవోకేలో పరిస్థితులు మారుతున్నాయని, అక్కడి ప్రజలే పాకిస్థాన్ పాలన నుంచి విముక్తి కోరుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు. మొరాకో పర్యటనలో ఉన్న ఆయన, అక్కడి భారతీయ సమాజాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. పీవోకేలో ప్రజలు పాకిస్థాన్ పాలనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, స్వేచ్ఛ కోసం

2లో..

## ఏపీలో సరికొత్త డిజిటల్ శకం

**- జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో చంద్రబాబు**

- వాట్సాప్ ద్వారా 751 పౌరసేవలు అందిస్తున్నట్లు వెల్లడి
- సాంకేతికతతోనే ప్రజల జీవితాల్లో మార్పు సాధ్యమని స్పష్టీకరణ
- ఐబీఎం, టీసీఎస్‌లతో కలిసి ఏపీలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన
- సంజీవని ప్రాజెక్టును దేశవ్యాప్తంగా అమలు చేసే అవకాశం ఉందని వ్యాఖ్య

2లో..



## ఇదొక విప్లవాత్మకమైన అడుగు

**- కొత్త జీఎస్టీ శ్లాబులపై జగన్**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** దేశవ్యాప్తంగా సోమవారం నుంచి అమల్లోకి వచ్చిన కొత్త జీఎస్టీ (వస్తు, సేవల పన్ను) శ్లాబులపై ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ స్పందించారు. జీఎస్టీలో చేపట్టిన క్రమబద్ధీకరణను ఆయన స్వాగతించారు. సరళమైన, న్యాయమైన పన్నుల వ్యవస్థను రూపొందించే దిశగా ఇది ఒక విప్లవాత్మక అడుగు అని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు సోషల్ మీడియా

2లో..

## ఇకపై తెలంగాణ భవన్ కాదు.. 'జనతా గ్యారేజ్'

- ఆర్ఆర్ఆర్ బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ హామీ
- సమస్యల పరిష్కారానికి తెలంగాణ భవన్‌లో న్యాయవాదుల సాయం
- అలైన్‌మెంట్లు మార్చడం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని విమర్శ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై తెలంగాణ భవన్ కేవలం పార్టీ కార్యాలయం కాదని, ప్రజల సమస్యలు పరిష్కరించే 'జనతా గ్యారేజ్' అని ఆయన ప్రకటించారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఇక్కడికి రావచ్చని, న్యాయ సహాయం కోసం నిపుణులైన న్యాయవాదులు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ వల్ల నష్టపోతున్న రైతులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. నల్గొండ, సూర్యాపేట, గజ్వేల్, సంగారెడ్డి నియోజకవర్గాల నుంచి వచ్చిన బాధితులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ నిర్వాసితులతో తామే స్వయంగా రోజుల తరబడి చర్చలు జరిపి, మెరుగైన

2లో..

## అరికెపూడి గాంధీ కబ్జా భూమిని స్వాధీనం చేసుకోండి

**- ప్రభుత్వానికి కవిత సవాల్**

- గాజులరామారంలో పేదల ఇళ్ల కూల్చివేతపై తీవ్ర ఆగ్రహం
- మళ్లీ బుల్డోజర్ వస్తే అడ్డుగా నిలబడతానని హెచ్చరిక
- బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, 50 వేల సాయం డిమాండ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని గాజుల రామారం, బాలయ్యబస్తీ, గాలిపోచమ్మ బస్తీలలో ఉన్న సర్వే నంబర్లు 307, 329/1, 342 పరిధిలో హైడ్రా కూల్చివేతలను మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వానికి పెద్దవాళ్లు చేసిన కబ్జాలు, ఆక్రమణలు కనపడవా పేదల ఇండ్ల మీదకు వచ్చి కూల్చడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి దమ్ముంటే కనుక బడాబాబులు చేసిన కబ్జాలు, అక్రమ నిర్మాణాలను ముందుగా

2లో..

## సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు లైన్ క్లియర్

**- ఎన్‌ఓసీ ఇచ్చేందుకు ఛత్తీస్‌గఢ్ అంగీకారం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో గోదావరి నదిపై నిర్మించ తలపెట్టిన సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు మరో అడుగు ముందుకు పడింది. ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న అభ్యంతరాలను పరిష్కారం లభించింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో మాట్లాడి అనుమానాలు నివృత్తి చేశారు. దీంతో తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించింది. తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌తో సమావేశమయ్యారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుపై నెలకొన్న అనుమానాలు నివృత్తి చేసేందుకు రాయ్‌పూర్‌లో ఈ సమావేశం జరిగింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో ఛత్తీస్‌గఢ్‌లోని భూభాగాలు ముంపునకు గురి అవుతాయని ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై రెండు ప్రభుత్వాల మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ముంపునకు గురయ్యే ప్రాంతాలకు చెల్లించే నష్టపరిహారం ఇచ్చేందుకు తెలంగాణ ఇచ్చేందుకు అంగీకరించింది.

2లో..

## రూ. 50 వేల కోట్ల విలువైన భూములను రక్షించాం

- 923 ఎకరాలను ఆక్రమణల నుంచి రక్షించామన్న రంగనాథ్
- నగరంలో దాదాపు 60 చెరువులు కనుమరుగయ్యాయన్న కమిషనర్
- డీఆర్ఎఫ్ బృందాలను పెంచుతామన్న రంగనాథ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైడ్రా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 50 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను పరిరక్షించామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు మొత్తం 923 ఎకరాలను ఆక్రమణల నుంచి విడిపించామని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ నగరంలో దాదాపు 60 చెరువులు కనుమరుగయ్యాయని అన్నారు. ఆరు చెరువులకు పూర్తిస్థాయిలో పునరుజ్జీవం కల్పించామని వెల్లడించారు. గాజులరామారంలో కొందరు రౌడీషీటర్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించారని ఆయన తెలిపారు. ఆదివారం అక్కడ ఉన్న ఆక్రమణలను తొలగించామని వెల్లడించారు. నకిలీ పట్టాలు

2లో..

## హైదరాబాద్‌లో భీకర వర్షం

**- వరదలో కొట్టుకుపోయిన వాహనాలు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘావృతమైన ఆకాశంలో మధ్యాహ్నం తరువాత మబ్బులు కమ్ముకున్నాయి. మధ్యాహ్నం 3 తరువాత పలు ప్రాంతాల్లో ఒక్కసారిగా భారీవర్షం మొదలైంది. ఎల్బీనగర్, వనస్థలిపురం,

2లో..

## దండకారణ్యంలో అలజడి

- ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్‌లో ఎన్‌కౌంటర్
- రాజు దాదా, కోసా దాదా హతం - ఒక్కొక్కరిపై 40 లక్షల రివార్డు



**బస్తర్ (ప్రశ్న న్యూస్)** ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు నక్సల్స్ హతమయ్యారు. ఘటనా స్థలం నుంచి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. అబుజ్‌మాడ్‌లో రాజు దాదా అలియాస్ కట్టా రామచంద్ర రెడ్డి, కోసా దాదా అలియాస్ కడారి సత్యనారాయణ రెడ్డిని ఎదురుకాల్పుల్లో మట్టుబెట్టారు, వీరిద్దరిపై ఒక్కొక్కరికి రూ.40 లక్షల రివార్డు ఉంది. బస్తర్ పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలోని అబుజ్‌మాడ్ ప్రాంతంలో భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు

2లో..

# బీహార్ ఎన్నికలకు కసరత్తు

అవకాశం ఉందని, నవంబర్ 5 నుంచి 15 వరకూ మూడు విడతల్లో ఉంటుందని జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ప్రస్తుత బిహార్ అసెంబ్లీ గడువు నవంబరు 22న ముగియనుంది. ఈ నేపథ్యంలో గడువుకు ముందే ఎన్నికల ప్రక్రియ పూర్తయి కొత్త ప్రభుత్వం కొలువు దీరాల్సి ఉంటుంది. ఆలోగానే ఎన్నికలను పూర్తిచేయాలని ఈసీ భావిస్తోంది. ఎన్నికల నిర్వహణ, తుది ఓటర్ల జాబితాపై సమీక్ష కోసం కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వచ్చే వారం బిహార్‌లో పర్యటించనున్నారు.

ఈ నెల 30న ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రచురించనుంది.కాగా, బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై రాజకీయ దుమారం రేపుతోంది. ప్రత్యేక సవరణలో 65 లక్షల మంది ఓటర్లను తొలగించడం అనేక అనుమానాలకు తావిచ్చింది. దీనిపై విపక్ష ఇండియా కూటమి తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. ఇదే అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉంది. ఆధార్‌ను కూడా ఓటరు జాబితాలో పేరు నమోదుకు 12 వ పత్రంగా పరిగణించాలని ఈసీకి స్పష్టం చేసిన అత్యున్నత న్యాయస్థానం సెప్టెంబర్ 30న ప్రచురించే తుది జాబితాలో అక్రమాలు జరిగినట్టు రుజువైతే మొత్తం ప్రక్రియనే రద్దు చేస్తామని హెచ్చరించింది. ఈ తీర్పు దేశం మొత్తానికి వర్తిస్తుందని స్పష్టం చేసింది.

కాగా, బిహార్ శాసనసభ ఎన్నికలను కిందటిసారి కూడా మూడు విడతల్లో నిర్వహించారు. మొత్తం 243 స్థానాలున్న బిహార్ అసెంబ్లీకి అక్టోబర్ 28న (71 స్థానాలు), నవంబర్ 3న (94 నియోజకవర్గాలు), నవంబర్ 7న (78 నియోజకవర్గాలు) పోలింగ్ నిర్వహించి, నవంబర్ 10న ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించారు. అయితే, 2015లో మాత్రం 5 విడతలుగా ఎన్నికలు జరిగాయి. ఈసారి కూడా నితీష్ కుమార్ నాయకత్వంలోని అధికార ఎన్డీయే , తేజస్వీ యాదవ్ సారథ్యంలోని 'ఇండియా' కూటముల మధ్యే ప్రధాన పోటీ. ఎన్డీయేలో బీజేపీ, జేడీయూ, ఎల్జేజీ (రామ్‌విలాస్) భాగస్వాములు కాగా మహాఘటబంధన్‌లో కాంగ్రెస్, ఆర్జేడీ వామపక్షాలు ఉన్నాయి. కిందటి ఎన్నికల్లో ఎన్డీయేకు 126 స్థానాలు (బీజేపీ 75, జేడీయూ 45, హిందూస్థాన్ అవామీ మోర్చా (సెక్యులర్) 4, ఇద్దరు ఇండిపెండెంట్లు), మహాఘటబంధన్‌కు 117 (ఆర్జేడీ 78, కాంగ్రెస్ 19, వామపక్షాలు 15, ఇతరులు 5 స్థానాలు) సీట్లు వచ్చాయి.

# పైలట్లను టార్గెట్ చేస్తారా.?

స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)లకు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఎన్ కోటేశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ)తో పాటు కేంద్రం, డీజీసీఏలు ఈ వ్యవహారంపై తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది. జూన్ 12న జరిగిన ఈ ప్రమాదంపై ఏఏఐబీ జూలైలో ఒక ప్రాథమిక నివేదికను విడుదల చేసిన విషయం తెలిసిందే.'సేఫ్టీ మ్యాటర్స్ ఫౌండేషన్' అనే స్వచ్ఛంద సంస్థ ఈ పిల్‌ను దాఖలు చేసింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. ప్రాథమిక నివేదికలో కీలక సమాచారాన్ని దాచిపెట్టారని, ఇంధన స్విచ్ లోపాలు, ఎలక్ట్రికల్ సమస్యల వంటి వ్యవస్థాగత లోపాలను తక్కువ చేసి చూపిస్తూ మొత్తం నెపాన్ని పైలట్లపైకి నెట్టే ప్రయత్నం జరిగిందని ఆయన ఆరోపించారు.

దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల బృందంలో ముగ్గురు డీజీసీఏకు చెందినవారే ఉండటం పక్షపాతానికి దారితీస్తుందని, ఇది ప్రయోజనాల విరుద్ధమని ఆయన వాదించారు. "ఏ సంస్థపై అయితే ప్రశ్నలు తలెత్తుతున్నాయో, అదే సంస్థ ఉద్యోగులు ఎలా దర్యాప్తు చేస్తారు?" అని ఆయన ప్రశ్నించారు.నివేదిక ప్రభుత్వానికి చేరకముందే, 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' పత్రికలో పైలట్లనే దోషులుగా చూపబోతున్నారంటూ కథనం వచ్చిందని ప్రశాంత్ భూషణ్ కోర్టు దృష్టికి తెచ్చారు. "అనుభవజ్ఞులైన పైలట్లు ఉద్దేశపూర్వకంగా ఇంజిన్లకు ఇంధన సరఫరాను నిలిపివేశారనే కథనాన్ని ప్రచారం చేశారు" అని ఆయన తెలిపారు. ఈ వాదనపై స్పందించిన జస్టిస్ సూర్య కాంత్, "ఇలాంటివి చాలా దురదృష్టకరమైన, బాధ్యతారహితమైన వ్యాఖ్యలు" అని పేర్కొన్నారు. ఇలాంటి సున్నితమైన విషయాల్లో గోప్యత చాలా కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ వెళుతున్న ఎయిర్ ఇండియా విమానం ఏఐ 171 టేకాఫ్ అయిన కొద్ది క్షణాలకే కుప్పకూలింది. ఈ ప్రమాదంలో 12 మంది సిబ్బందితో పాటు, 230 మంది ప్రయాణికులలో 229 మంది మరణించారు. విమానం సమీపంలోని ఓ మెడికల్ కాలేజీ హాస్టల్‌పై పడటంతో అక్కడ మరో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ పెను విషాదంలో ఒక ప్రయాణికుడు మాత్రమే అద్భుతంగా ప్రాణాలతో బయటపడ్డాడు.

# పాలస్తీనా దేశం అనేదే ఉండదు

ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా అధికారికంగా వెల్లడించింది. పాలస్తీనా దేశ ఏర్పాటుకు అంతర్జాతీయంగా మద్దతు పెరుగుతున్న తరుణంలో ఇజ్రాయెల్ ఈ ప్రకటన చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2023 అక్టోబర్ 7న హమాస్ ఉగ్రవాదులు జరిపిన మారణహోమం తర్వాత, తమ దేశం మధ్యలో బలవంతంగా ఒక ఉగ్రవాద రాజ్యాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నాలను ఎట్టిపరిస్థితుల్లోనూ జరగనివ్వబోమని నెతన్యాహు ప్రభుత్వం స్పష్టం చేసింది. పాలస్తీనాకు మద్దతు ఇస్తున్న దేశాలకు ఇది తమ నుంచి స్పష్టమైన సందేశం అని పేర్కొంది. ఈ నెలాఖరులో జరగనున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాల్గొనేందుకు నెతన్యాహు అమెరికా వెళ్లనున్నారు. ఈ పర్యటన నుంచి తిరిగి వచ్చాక దీనిపై పూర్తిస్థాయిలో స్పందిస్తామని, కీలక ప్రకటన ఉంటుందని ప్రధాని కార్యాలయం తెలిపింది. ఆసక్తికరంగా, ఈ పర్యటన సందర్భంగా వైట్‌హౌస్‌కు రావాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి నెతన్యాహుకు ఫోన్ కాల్ ద్వారా ఆహ్వానం అందింది. మరోవైపు, ఐక్యరాజ్యసమితిలో పాలస్తీనా దేశ ఏర్పాటుకు మద్దతుగా తీర్మానం ప్రవేశపెట్టేందుకు పలు దేశాలు ప్రయత్నిస్తున్న సమయంలో ఇజ్రాయెల్ ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. పాలస్తీనాను ఒక దేశంగా గుర్తిస్తున్నట్టు బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా ఇప్పటికే బాహాటంగా ప్రకటించాయి. గత ఏడాది అక్టోబర్‌లో హమాస్ జరిపిన దాడిలో అనేక మంది ఇజ్రాయెలీలు ప్రాణాలు కోల్పోగా, 250 మందిని బందీలుగా తీసుకెళ్లారు. అప్పటి నుంచి హమాస్‌ను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ గాజాపై భీకర దాడులు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

# ఏపీలో సరికొత్త డిజిటల్ శకం

ఇస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

### దీపావళికి మళ్లీ బోనస్ ప్రకటిస్తామన్న రేవంత్ రెడ్డి

సింగరేణి సంస్థ కోసం కార్మికులు ఎంతగానో శ్రమిస్తారు. పండుగ సమయంలో వారి కష్టాన్ని గుర్తించి సంస్థ లాభాల్లో కార్మికులకు 34 శాతం వాటాను అందిస్తున్నాం. దసరా సమయంలో వారి కుటుంబాల్లో సంతోషాన్ని నింపేందుకు ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. సింగరేణి మొత్తం లాభం రూ.2360 కోట్లు అని రేవంత్ తెలిపారు. దీపావళి సందర్భంగా మళ్లీ బోనస్ ప్రకటిస్తామని మరో గుడ్ న్యూస్ చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సింగరేణి కార్మికుల పాత్ర మరిచిపోలేనిది అన్నారు.

### జీఎస్టీ సవరించడంతో 7000 కోట్లు నష్టం..

'కార్పొరేట్ కంపెనీలతో పోటీ పడేలా సింగరేణిని తీర్చిదిద్దుతాం. సింగరేణి సంస్థ మొత్తం ఆదాయం రూ.6394 కోట్లు. దీనిలో రూ.4034 కోట్లు భవిష్యత్ పెట్టుబడులకు కేటాయించాం. ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిన గనులను సైతం తిరిగి సింగరేణికి అప్పగించేలా చూడాలని కార్మికులు కోరారు. ప్రైవేటు భాగస్వామ్యం పెరుగుతూ పోతే భవిష్యత్ లో సింగరేణి కాలరీస్ మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. ఈ సమస్యను పరిష్కారం దిశగా కేంద్రంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. సింగరేణి సంస్థను లాభాల బాటలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తాం. కేంద్రం జీఎస్టీ సవరణతో దాదాపు రూ.7 వేల కోట్లు ఆదాయం తగ్గింది. తక్షణమే రాష్ట్రానికి జరిగే నష్టాన్ని కేంద్రమే పూడ్చాలని కోరతామని' రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్, ఎంపీలు బలరాం నాయక్, రఘురాం రెడ్డి, సింగరేణి సీఎండీ బలరాం, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

### గతేడాది దసరాకు రూ.796 కోట్లు బోనస్

ఇదిలా ఉంటే గత ఏడాది దసరాకు రూ.796 కోట్లు దసరా బోనస్ ఇచ్చింది ప్రభుత్వం. అంతేకాదు సింగరేణి చరిత్రలోనే తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు కూడా దసరా బోనస్ ఇచ్చింది. 2023-24 ఏడాదిలో సింగరేణికి రూ.4,701 కోట్లు లాభం వచ్చింది. ఇందులో భాగంగా సింగరేణి కార్మికులకు రూ.796 కోట్లు బోనస్‌గా ప్రకటించింది.

# యుద్ధం అక్కర్లేదు..

ఉద్యమిస్తున్నారని ఆయన తెలిపారు. "పీవోకేలో డిమాండ్లు ఇప్పటికే మొదలయ్యాయి. మీరు నినాదాలు వినే ఉంటారు. 'నేను కూడా భారతీయుడినే' (మెయిన్ భీ భారత్ హూన్) అంటూ అక్కడ నినాదాలు మిన్నంటున్నాయి. కాబట్టి మనం బలప్రయోగం చేయాల్సిన అవసరం రాదు" అని రాజ్‌నాథ్ వివరించారు. ఐదేళ్ల క్రితం కశ్మీర్ లోయలో సైనికులతో మాట్లాడినప్పుడు కూడా ఇదే విషయాన్ని తాను చెప్పానని ఆయన గుర్తుచేశారు. పీవోకేను తిరిగి చేజిక్కించుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' సమయంలో చేజార్చుకుందంటూ విపక్షాలు విమర్శలు చేస్తున్న తరుణంలో రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మే 7న జరిగిన ఆ ఆపరేషన్‌లో భారత్‌కు పైచేయి ఉన్నప్పటికీ, కేవలం కాల్పుల విరమణ ఒప్పందంతో సరిపెట్టుకుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇదే ప్రసంగంలో, ఇతర దేశాల చర్యలపై భారత్ సంయమనంతో వ్యవహరిస్తుందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ఎగుమతులపై 50% సుంకాలు విధించినా, రష్యా నుంచి చమురు కొనుగోలు చేసినందుకు 25% జరిమానా విధించినా తాము వెంటనే స్పందించలేదని అన్నారు. "విశాల హృదయం ఉన్నవారు ప్రతీదానికి వెంటనే స్పందించరు" అంటూ ఆయన భారత దౌత్య వైఖరిని పరోక్షంగా సమర్థించుకున్నారు.

# హైదరాబాద్‌లో భీకర వర్షం

హయత్‌నగర్, అబ్దుల్లాపూర్ మెట్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, పంజాగుట్ట, ఖైరతాబాద్, ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట, ఎర్రగడ్డ, బోరబండ, సనత్‌నగర్, యూసఫ్‌గూడ, శ్రీకృష్ణనగర్ వర్షం పడుతోంది. పంజాగుట్ట, శ్రీకృష్ణనగర్‌లో రహదారిపై వరద ప్రవహిస్తోంది. పంజాగుట్ట, ఖైరతాబాద్, అమీర్‌పేటలో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్లో శ్రీనగర్ కాలనీలో 9, ఖైరతాబాద్లో 8 సెంటీ సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.ఈ వర్షాల కారణంగా రహదారులు జలమయం అయ్యాయి. రహదారిపై భారీగా వర్షపు నీరు చేరి వాహనదారుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షం, రహదారిపై వరదతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. రాజ్‌భవన్ రహదారిలో మోకాళ్లలోతు వర్షపు నీరు చేరింది. రాజ్‌భవన్ రహదారిలో వాహనదారుల ఇబ్బందులు పడుతున్నారు. అమీర్‌పేటలో మోకాళ్ల లోతు వర్షపు నీటిలో వాహనదారుల అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఎస్ఆర్ నగర్, మైత్రివనం మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లో మోకాళ్ల లోతు వర్షపు నీరు చేరింది. పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వరద ప్రాంతాల్లో హైడ్రా, జీహెచ్ఎంసీ సిబ్బంది సహాయ చర్యలు చేపట్టింది. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లోని జారానగర్ కుంటను వరద ముంచెత్తింది. జారానగర్ కుంటలో పలు వాహనాలు కొట్టుకుపోయాయి. బంజారాహిల్స్ పరిధి హకీంపేటలో భారీగా వరద నీరు చేరింది. వరదలో ఆటో, ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. వరద పోటెత్తడంతో వ్యాన్ డ్రైవర్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొట్టుకుపోతున్న వ్యాన్‌ను అతి కష్టం మీద డ్రైవర్ బయటకు తెచ్చారు. బంజారాహిల్స్ పరిధి హకీంపేటలో వరద ధాటికి గోడ కుప్పకూలింది. హకీంపేటలో వరద ధాటికి విద్యుత్ స్తంభం నేలకూలింది.

## రూ. 50 వేల కోట్ల విలువైన భూములను రక్షించాం

సృష్టించి నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ప్రభుత్వ భూమిలోని 260 నిర్మాణాలను తొలగించామని ఆయన అన్నారు. ప్రస్తుతం 51 డీఆర్ఎఫ్ బృందాలు ఉన్నాయని, త్వరలోనే వాటి సంఖ్యను 72కు పెంచుతామని అన్నారు.

నగరంలో 150 మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లు ఉన్నాయని తెలిపారు. నాలాల వద్ద ఆక్రమణలు గుర్తించి తొలగిస్తున్నట్లు హైడ్రా కమిషనర్ తెలిపారు. వాటిలో పూడికతీత పనులను ముమ్మరం చేశామని అన్నారు. అధిక కాలుష్యం కారణంగా నగరాల్లోనే ఎక్కువగా వర్షాలు కురుస్తున్నాయని రంగనాథ్ తెలిపారు. భవిష్యత్తు అంతా యువతదే కాబట్టి, జెన్ జెడ్ తరం పార్కులు, చెరువుల గురించి ఆలోచించాలని సూచించారు.

# దండకారణ్యంలో అలజడి

నక్సల్స్ హతమయ్యారు. అబుజ్‌మాడ్‌లోని మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో నక్సల్స్ ఉన్నారన్న సమాచారం మేరకు భద్రతా బలగాలు నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌కు వెళ్లాయి.

### ఆయుధాలు స్వాధీనం

తనిఖీలు చేసే సెక్యూరిటీ టీంలు ఆ ప్రాంతానికి చేరుకోగానే నక్సల్స్ భద్రతా బలగాలపై కాల్పులు జరిపారని, అనంతరం భద్రతా బలగాలు కూడా ఎదురు కాల్పులు జరిపాయని అధికారులు తెలిపారు. ఘటనా స్థలంలో ఇద్దరు నక్సల్స్ మృతదేహాలు, ఏకే 47 రైఫిల్, ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలు, ప్రచార సామాగ్రి, రోజువారీ వినియోగించే వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో కాల్పులు కొనసాగుతున్నాయి.

### సోదాలు కొనసాగుతున్నాయి

హతమైన నక్సల్స్‌ను గుర్తించే పనిలో ఉన్నామని ఆయన చెప్పారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆ ప్రాంతంలో సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఆపరేషన్ పూర్తయిన తర్వాత ఈ విషయంలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

### ఈ ఏడాది 249 మంది నక్సల్స్ హతం

ఈ చర్యతో ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో ఇప్పటివరకు 249 మంది నక్సల్స్ హతమయ్యారు.

వీరిలో 220 మంది బస్తర్ డివిజన్‌లో (నారాయణ్‌పూర్ సహా ఏడు జిల్లాలు ఉన్నాయి) హతమవ్వగా, మరో 27 మంది రాయ్‌పూర్ డివిజన్‌లోని గరియాబంద్ జిల్లాలో హతమయ్యారు. దుర్గ్ డివిజన్‌లోని మొహ్లా-మాన్‌పూర్-అంబాగఢ్ చౌకీ జిల్లాలో మరో ఇద్దరు నక్సల్స్ హతమయ్యారు. గత నెల 11న రాష్ట్రంలోని గరియాబంద్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో నిషేధిత సీపీఐ (మావోయిస్ట్) కేంద్ర కమిటీ సభ్యుడు (సీసీఎం) మోడెం బాలకృష్ణతో సహా 10 మంది నక్సల్స్ హతమయ్యారు.

## ఇకపై తెలంగాణ భవన్ కాదు..

# 'జనతా గ్యారేజ్'

పరిహారం, ఇళ్లు ఇచ్చి ఒప్పించామని గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ నాయకులు రైతుల సమస్యలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయికి వెళ్లడానికే ముఖం చాటేస్తున్నారని ఆయన ఆరోపించారు. గతంలో ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే అలైన్‌మెంట్లు మార్చి రైతులను ఇబ్బందులకు గురిచేసిందని కేటీఆర్ విమర్శించారు. అలైన్‌మెంట్లు మార్చి పేదల జీవితాలతో ఆడుకోవడం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని అన్నారు. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను శాస్త్రీయంగా ఖరారు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటంలో రైతులెవరూ ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు గ్రామ గ్రామాన తీర్మానాలు చేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాలని ఆయన రైతులకు సూచించారు. అలా చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి సమస్యను పరిష్కరిస్తాయని తెలిపారు.

# యువకుడిని కాపాడిన అధికారులు

**విశాఖపట్నం** విశాఖపట్నం ఆర్కే బీచ్ లో సము ద్రపు అలల తాకిడికి కొట్టుకుపోయి న రాజస్థాన్ కు చెందిన భవాని సింగ్ అనే యువకుడిని పోర్ట్ మెరై న్ పోలీసులు, జీవీఎంసీ లైఫ్ గార్డ్స్ సకాలంలో స్పందించి రక్షించారు. ఈత కోసం సముద్రంలోకి వెళ్లిన యువకుడు అలల ఉధృతికి కొట్టు కుపోవడంతో, అప్రమత్తమైన అధికారులు అతన్ని ఒడ్డుకు చేర్చి, వైద్య సహాయం, కౌన్సిలింగ్ అందించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# ఇదొక విప్లవాత్మకమైన అడుగు

ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కొత్త విధానం వల్ల వస్తువులు, సేవలు ప్రతి పౌరుడికి మరింత సులభంగా, అందుబాటు ధరల్లో లభించేందుకు మార్గం సుగమం అవుతుందని జగన్ పేర్కొన్నారు. "జీఎస్టీ పునర్నిర్మాణం సరళమైన, న్యాయమైన పన్ను వ్యవస్థ వైపు ఒక విప్లవాత్మక అడుగు. వస్తువులు, సేవలను ప్రతి పౌరుడికి మరింత సరళంగా, సరసమైనదిగా మార్చడానికి ఈ చర్యలు ఎంతో తోడ్పడతాయి" అని ఆయన అన్నారు. అమలు ప్రక్రియలో తొలినాళ్లలో కొన్ని ఫిర్యాదులు, నిర్వహణలో లోపాలు ఉండవచ్చని అభిప్రాయపడుతూనే, ఇదొక నిరంతర ప్రక్రియ అని జగన్ తెలిపారు. అంతిమంగా దీని ప్రయోజనాలు సామాన్య వినియోగదారులకు కచ్చితంగా చేరుకుంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "ఇది కచ్చితంగా ఆర్థిక వ్యవస్థలో వినియోగానికి, మరింత పెట్టుబడులకు అవసరమైన ప్రోత్సాహాన్ని ఇస్తుంది" అని ఆయన తన పోస్టులో వివరించారు.

# ఏపీలో సరికొత్త డిజిటల్ శకం

అమరావతి (ప్రశ్న న్యూస్) సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తీసుకురావడమే లక్ష్యమని, డిజిటల్ పరివర్తన ద్వారానే ఇది సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవలను ప్రజల మొబైల్ ఫోన్లకే చేర్చేలా రాష్ట్రంలో 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇప్పటికే 751 రకాల పౌర సేవలను అందిస్తున్నామని ఆయన వెల్లడించారు. సోమవారం విశాఖపట్నంలో కేంద్ర ఐటీ, సమాచార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైన 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 'సివిల్ సర్వీసెస్ - డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అనే ప్రధాన ఇతివృత్తంతో రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలు ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐటీ, ఈ-గవర్నెన్స్‌పై దృష్టి సారించడం వల్ల పాలనలో గణనీయమైన మార్పులు వచ్చాయని, కమ్యూనికేషన్ రంగంలో వచ్చిన సంస్కరణలు ప్రజా జీవితంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికాయని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తన హయాంలోనే ఈ-సేవ, మీ-సేవ వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకు తీసుకెళ్లామని, ఇప్పుడు ఈ-ఫైల్స్, ఈ-కేబినెట్ వంటి విధానాలతో నిర్ణయాలు వేగవంతం అయ్యాయని వివరించారు. అయితే, సాంకేతికతను వినియోగించుకుంటున్న క్రమంలో సైబర్ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు.

### రాష్ట్రంలో క్వాంటం వ్యాలీ, సంజీవని ప్రాజెక్టు

ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ హబ్‌గా మార్చే దిశగా అనేక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు చేపడుతున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో రాష్ట్రంలో "క్వాంటం వ్యాలీ"ని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. దీని ద్వారా క్వాంటం కంప్యూటింగ్ సేవలను ప్రభుత్వ, విద్య, వైద్య రంగాలకు అందుబాటులోకి తీసుకురావచ్చని, ఇక్కడ ఒక బలమైన ఎకో సిస్టం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. క్వాంటం కంప్యూటర్ల తయారీ సంస్థలు కూడా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని వెల్లడించారు. మరోవైపు వైద్య రంగంలో టెక్నాలజీని అనుసంధానిస్తూ 'సంజీవని' ప్రాజెక్టును ప్రారంభించామని, బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి డిజిటల్ హెల్త్ రికార్డులను రూపొందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టు దేశవ్యాప్తంగా అమలు కావడానికి ఆస్కారం ఉందని ఆయన అన్నారు.

### దేశాభివృద్ధిలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుంది

రానున్న పదేళ్లు దేశానికి అత్యంత కీలకమని, సాంకేతికత కారణంగా సేవలు, ఉద్యోగాలు, ఉత్పాదక రంగాల్లో వేగంగా మార్పులు వస్తున్నాయని చంద్రబాబు విశ్లేషించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన 'స్వదేశీ ఉత్పత్తుల' నినాదాన్ని స్వాగతిస్తున్నామని, దేశంలో తయారైన ఉత్పత్తులు గ్లోబల్ బ్రాండ్స్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్రానికి ఒక సెమీ కండక్టర్ పరిశ్రమను కేటాయించినందుకు ప్రధానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. గతంలో బీపీఓ విధానం ద్వారా యువతకు ఉద్యోగాలు లభించాయని, కానీ ఇప్పుడు కొన్ని యాప్‌ల ద్వారా వస్తున్న ఆర్థిక ప్రయోజనాలు విదేశాలకు తరలిపోతున్నాయని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు.

సమీప భవిష్యత్తులో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్ సిటీ, మెడ్‌టెక్ పార్కుల ద్వారా జాతీయ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన భాగస్వామి అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం, సదస్సులో భాగంగా 'డిజిటల్ ఏపీ' సంచికను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌తో పాటు కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు లైన్ క్లియర్

దీంతో ప్రాజెక్టుకు ఎన్ఓసీ ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించినట్టు ప్రచారం జరుగుతోంది.గోదావరి నదిపై సమ్మక్క సాగర్ బ్యారేజ్ ప్రాజెక్టు సాగునీటి స్థిరీకరణ, తాగునీరు సరఫరా, విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో నిర్మించ తలపెట్టారు. ములుగు జిల్లాలోని తుపాకులగూడెం వద్ద ప్రారంభించారు. ఇది ఇంద్రావతి-గోదావరి లింక్ కోసం ఉపయోగపడుతుంది. ఈ ప్రాజెక్టు మొదట 'కంతనపల్లి బ్యారేజ్'గా ప్రతిపాదించారు.

ఇది పీవీ నరసింహారావు కంతనపల్లి సుజల స్రవంతి ప్రాజెక్ట్‌లో భాగం 2016లో భూసేకరణ సమస్యలు నివారించేందుకు స్థానాన్ని మార్చారు. 2017 ఫిబ్రవరి 13న నిర్మాణం ప్రారంభమైంది. 2020 ఫిబ్రవరి 13న తుపాకులగూడెం బ్యారేజ్‌ను 'సమ్మక్క బ్యారేజ్'గా పేరు మార్చారు. ఇది సమ్మక్క సరలమ్మ జాతరకు సమీపంలో ఉండటం వల్ల ఈ పేరు పెట్టారు. దీని నిర్మాణ బాధ్యతను రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టింది. ఈ ప్రాజెక్టు ఏటూరునాగరం వన్యప్రాణుల అడవి సంరక్షణ ప్రాంతానికి సమీపంలో ఉంది. ఈ ప్రాజెక్టు 83 మీటర్ల ఎత్తుతో 1,132 మీటర్ల పొడవుతో 48 రేడియల్ లిఫ్ట్ గేట్లతో నిర్మించనున్నారు.

## అరికెపూడి గాంధీ కబ్జా భూమిని

# స్వాధీనం చేసుకోండి

కూల్చాలని డిమాండ్ చేశారు. ఆదివారం నాడు హైడ్రా సిబ్బంది అక్రమ నిర్మాణాలను కూల్చివేసింది. కూల్చివేతలతో నివాసాలు, తమ షెడ్లు కోల్పోయి బాధపడుతున్న వారిని మాజీ ఎమ్మెల్సీ కవిత సోమవారం నాడు పరామర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వంపై ఆమె తీవ్ర విమర్శలు చేశారు.

### రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

గాజుల రామారం బస్తీలో పేదల ఇళ్లను కూల్చివేయడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని కవిత విమర్శించారు. పేదల ఇళ్లను కూల్చడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారింది. పండగ పూటలోనూ ఈ ప్రభుత్వం పేదల జీవితాల్లో చీకట్లు నింపుతోంది. పేద ప్రజలపై ఇలాంటి చర్యలు సరికాదన్నారు. అమాయక ప్రజల ఇండ్లను కూల్చి, వారి రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘన

కోర్టు ఉత్తర్వులు అమలు చేయకుండా, శనివారం, ఆదివారం వంటి వారాల్లో హైడ్రా అధికారులు కూల్చివేతలు జరపడాన్ని కూడా కవిత విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం కోర్టు ఆదేశాలను పరిగణలోకి తీసుకోకుండా తమ ఇష్టరీతిన పేదల ఇళ్ళను కూల్చుతోందని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

### అరికెపూడి గాంధీ భూమి స్వాధీనం చేసుకోండి

ప్రభుత్వానికి దమ్ము, ధైర్యం ఉంటే అరికెపూడి గాంధీ కబ్జా చేసిన 12 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని కవిత సవాల్ విసిరారు.

ముందస్తు సూచనలు, నోటీసులు లేకుండా కూల్చివేతలు చేపట్టడం సరికాదన్నారు. పేదలను, చిన్న పిల్లలను కూడా బయటకు పంపి వారి ఇళ్ళను కూల్చడం హేయమైన చర్యగా అభివర్ణించారు.

నిరుపేదలకు ప్రత్యామ్నాయంగా ఇండ్లు కట్టించి ఇచ్చిన తరువాతే ఈ నిర్మాణాలను కూల్చాలని కవిత డిమాండ్ చేశారు. వారికి వసతి ఏర్పాట్లు చేయకుండా అక్రమ నిర్మాణాలు తొలగించడం సరికాదన్నారు. ప్రభుత్వం నిరుపేదలకు కట్టించి ఇస్తామంటున్న డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చాక మాత్రమే, వారి షెడ్లు, నిర్మాణాలను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. లేదంటే, పేదల పక్షాన నిలిచి తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందని కవిత హెచ్చరించారు.

# చదువు పేదరికం అడ్డు కాదని నిరూపించిన దళిత బిడ్డ

**ఎంబీబీఎస్ సీటు సాధించిన గొర్ల సంధ్యారాణి.**

**వైద్య విద్యకు ఆర్థిక సహకారం అందించాలని తల్లిదండ్రుల వేడుకోలు.**



తల్లాడ, సెప్టెంబర్ 22 (ప్రశ్న న్యూస్) అన్నారుగూడెం గ్రామంలో ఓ దళిత బిడ్డ చదువుకు పేదరికం అడ్డు కాదని నిరూపించింది. ఇటీవల నిర్వహించిన దేశ వ్యాప్త నీట్ పరీక్షల ఫలితాల్లో అన్నారుగూడెం కు చెందిన గొర్ల సంధ్యారాణి 13597 ర్యాంక్ రావడంతో కుటుంబ సభ్యులు ఆనందిస్తున్నారు. భద్రాది కొత్తగూడెం ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది . సంధ్యారాణి మొదటి నుంచి ప్రభుత్వ పాఠశాలలోనే విద్య నభ్యసించింది. రెక్క ఆడితేనే తప్ప డొక్కాడని బ్రతుకులు కుటుంబ పరిస్థితి ఉంది. గత సంవత్సరం నీట్ పరీక్షలు రాయగా నీట్ ఫలితాల్లో ఆశించిన ర్యాంకు రాకపోవడంతో తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి ఆశ జనకంగా లేకపోవడంతో సంధ్యారాణి డిగ్రీ చేయమని తల్లిదండ్రులు కోరారు. మేనమామలు సంధ్యారాణి చదువుల తల్లి అని గమనించి నిట్ పరీక్షల్లో కోచింగ్ ఇప్పించగా రెండు రోజుల క్రితం ఫలితాలు రాగా దానిలో భాగంగా ఎంబిబిఎస్ సీటు సాధించడంతో కుటుంబ సభ్యులు, మేనమామలు సంతోషానికి అవధులు లేకుండా పోయాయి, ఇంతవరకు బాగానే ఉన్నా ఎంబిబిఎస్ చేయడానికి ఫీజు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో అపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

**- దాతల కోసం ఎదురుచూపు.!**

తన కుమార్తె సంధ్యారాణి ఎంబిబిఎస్ లో సీటు రావడం సంతోషంగానే ఉన్న ఉన్నత విద్యకు హాస్టల్లో ఉంటూ చదువుకోడానికి దాతలు ముందుకు రావాలని తల్లిదండ్రులు గొర్ల బాబు ప్రాధాయపడుతున్నారు. తనకు ముగ్గురు కుమార్తెలు అని వారిని తన పరిధిలో ఉన్నత చదువులు చదివిస్తున్న. వైద్య విద్యకు దాతలు సహకారం అందించాలని. స్వచ్ఛంద నిర్వాహకులు తన కుమార్తె చదువులకు ఆర్థిక సహకారం చేయాలని వేడుకుంటున్నారు.

# కార్మిక గొంతులు నొక్కాలని చూడటం అత్యంత హేయమైన చర్య..!!

**టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు ఏదులాపురం గోపాలరావు డిమాండ్**



జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) సెప్టెంబర్ 22: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) అనుబంధ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ కార్మికుల డిమాండ్ల సాధనకు ఇచ్చిన "సెప్టెంబర్ 22 ఛలో ఎస్.పి.డి. కార్యాలయం" పిలుపును భగ్నం చేసేందుకు చేసిన అక్రమ అరెస్టులనుటియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు ఏదులాపురం గోపాలరావు సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కనీస వేతనాలను రూ.26 వేలు చేయాలనీ, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులను భర్తీ చేయాలనీ, కుక్, స్వీపర్, స్కావెంజర్, వాచ్ ఉమెన్ పోస్టులకు 10వ తరగతి విద్యార్హత నిబంధన తొలగించాలనీ, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ కల్పించాలనీ, ప్రభుత్వ గుర్తింపు కార్డులను ఇవ్వాలనే తదితర డిమాండ్లపై శాంతియుతంగా జరప తలపెట్టిన కార్యక్రమాన్ని భగ్నం చేయపూనుకోవడం శోచనీయమని ఆయన తెలిపారు.అధికారానికి రాక ముందు "ఆక్యుపై ఇందిరా పార్కు' ఆందోళనలో భాగస్వామయమైన కాంగ్రెస్, 7వ డిమాండ్గా ప్రజాస్వామ్యాన్ని హామినిచ్చిన కాంగ్రెస్ అధికారానికి వచ్చాక ఇలా అప్రజాస్వామికంగా కార్మిక గొంతులు నొక్కాలని చూడడం అత్యంత హేయమైన చర్య అని ఆయన స్పష్టం చేశారు.ఎస్.పి.డి. కార్యాలయం దగ్గర నిరసన తెలిపేందుకు అనుమతినిచ్చిన పోలీసులు అక్రమ అరెస్టులకు పూనుకోవడం దుర్మార్గకరమన్నారు. తమ సమస్యల గురించి అధికారులకు చెప్పుకొనేందుకు ఆదిలాబాద్, నిర్మల్, నారాయణపేట, పెద్దపల్లి, సూర్యాపేట, నాగర్ కర్నూల్, ,మహబూబ్నగర్ జిల్లాల నుండి బయలుదేరిన కేజీబీవీ వర్కర్లను, టీయుసీఐ రాష్ట్ర నాయకులు గంగన్న, జగన్, నరసింహ, కేజీబీవీ రాష్ట్ర నాయకులు రాజేశ్వరి, లీలమ్మ, తదితరులను అరెస్టు చేశారని,వీరిని వెంటనే విడుదల చేయాలని గోపాలరావు డిమాండ్ చేసారు. ప్రజాస్వామ్యయుతంగా నిర్వహించుకునే కార్యక్రమాలను అడ్డుకోవడం సరైన పద్ధతి కాదని,ఇటువంటి అప్రజాస్వామ్యక చర్యలు పునరావృతం కాకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గోపాలరావు డిమాండ్ చేసారు.

# వల్ల పిన్ని సత్యనారాయణ మరణం బాధాకరం..!



జూలూరుపాడు(ప్రశ్న న్యూస్) కొత్తూరు గ్రామపంచాయతీ సీపీఐ సీనియర్ నాయకులు వల్ల పిన్ని సత్యనారాయణ కరెంట్ షాక్ తో మరణించడం బాధాకరమని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్ వారి భౌతిక గాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు, మండలంలో పార్టీ అభివృద్ధి కోసం, ఎంతో కృషి చేశారని ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేశారని పార్టీ కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషించేవాడని నిజాయితీ నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయామని అనునిత్యం పేదల పక్షాన నిలబడే వల్ల పిన్ని సత్యనారాయణ మరణం ఈ ప్రాంత వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటు అని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలిపారు వారి కుటుంబ సభ్యులకు సీపీఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు నివాళు లర్పించిన వారిలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎల్లంకి కృష్ణయ్య సీపీఐ నాయకులు ఎల్లంకి మధు గార్లపాటి వీరభద్రం యాస, రోశయ్య ఊడల సుధా, కొమ్ము రాంబాబు వెంకటేశ్వర్లు తదితరులు నివాళులర్పించారు

# గౌలిడోడ్డి గ్రామంలో దసరా నవరాత్రి ఉత్సవాలు



**శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్)**శేర్లింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గౌలిదొడ్డి గ్రామంలోని పోచమ్మ - ఎల్లమ్మ దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల తొలి రోజు అమ్మవారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బాల త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చి ఆహ్లాదపరిచారు.గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం పూలతో, దీపాలతో శోభాయమానంగా అలంకరించబడగా, భక్తులతో సందడిగా మారింది.దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో, దేవాలయ అధ్యక్షులు జంగయ్య యాదవ్ సారథ్యంలో ఈ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలతో అమ్మవారి దర్శనం భక్తులకు కల్పించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

# అక్రమ సెల్లార్ లతో సవాల్ విసురుతున్న నిర్మాణదారులు

**- జనగామ పట్టణంలో మున్సిపల్ సిబ్బంది ఏమి చేస్తున్నారు.?**
**- అనుమతులు లేకుండా పట్టణంలో వెలుస్తున్న అక్రమ సెల్లార్ నిర్మాణాలు**
**- భారీగా లంచాలకు అలవాటుపడ్డ మున్సిపల్ సిబ్బంది**
**- నోటీసులు ఇవ్వడం, అక్రమ వసూళ్లకు పాల్పడటం**
**- ఒక్కటి కాదు రెండు కాదు లెక్కలేనన్ని అక్రమ సెల్లార్ నిర్మాణాలు**
**- చేతులెత్తేసిన కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్**
**- ఫిర్యాదుచేస్తే నోటీసులు ఇచ్చామంటూ వివరణ, మరి చర్యలు ఎవరు తీసుకోవాలో.?**
**- ఏదైనా ప్రమాదాలు సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారు.?**



**"జనగామ పట్టణం ఇప్పుడిప్పుడే అభివృద్ధి పథంలోకి నడుస్తోంది. జనాభా పెరుగుతున్నారు. ఉపాధి అవకాశాలు కూడా లభిస్తున్నాయి. విద్య, వైద్యం, వ్యాపారాలు ఊపందుకున్నాయి. కానీ ఈ పరిస్థితుల్లో సక్రమంగా విధులు నిర్వహించాల్సిన ప్రభుత్వ అధికారులు లంచాలు తీసుకుంటూ విధులు సక్రమంగా నిర్వహించకుండా వ్యవస్థని బ్రష్టు పట్టిస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది లంచాల మోజులో తమ బాధ్యతలు విస్మరిస్తున్నారు. మున్సిపల్ పరిధిలో సెల్లార్ నిర్మాణాలకు అనుమతి లేదు అని ఉన్నత అధికారులు చెబుతుండగా జనగామలో ఇబ్బడి ముబ్బడిగా సెల్లార్ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. గతంలోనూ, ప్రస్తుతం కూడా ఈ నిర్మాణాలు ఆగడం లేదు. భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత తీసుకుంటారు.? అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతోంది"**



**జనగామ(ప్రశ్న న్యూస్)** జనగామ పట్టణంలో అక్రమ సెల్లార్ నిర్మాణాలు ఎక్కువుగా జరుగుతున్నాయి. కలెక్టర్ కార్యాలయాన్ని పక్కనే ఒక నిర్మాణం. అలాగే కలెక్టరేట్ కు కూతవేటు దూరంలో అంటే 200 మీటర్స్ పరిధిలో మరొక పెద్ద నిర్మాణం, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాలు యదేచ్ఛగా జరుగుతున్నాయి. అవినీతి అధికార కనుసైగల్లో ఇక్కడ సెల్లార్ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి.అయితే దౌర్భాగ్యం ఏమిటంటే సెల్లార్ నిర్మాణాలు చేస్తున్నవారిని, మున్సిపల్ లో విధులు నిర్వహించే టీపీఓ గానీ, మున్సిపల్ కమిషనర్ గానీ చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. ఇదే అదునుగా చేసుకుని అక్రమ నిర్మాణదారులు రెచ్చిపోతున్నారు. దీనిపై స్థానిక ప్రజలు పలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ అధికారులందరూ లంచాలు తీసుకుని అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కాగా గతంలో కూడా ఎన్నో అక్రమ సెల్లార్ నిర్మాణాలు, అక్రమ అంతస్తుల నిర్మాణాలు జరిగాయని పేర్కొన్నారు.ఇదే విషయమై కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ వివరణ కోరితే. వారికి నోటీసులు ఇచ్చామని చెబుతూ తప్పించుకుంటున్నారు. కానీ చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేయడం వెనుక అంతర్యమేమిటి అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. లంచాలు తీసుకున్నారు కాబట్టే అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ బహిరంగంగా విమర్శిస్తున్నారు. అయితే లోగుట్టు పెరుమాళ్ళకు ఎరుక అన్న చందాన కమర్షియల్ కాంప్లెక్ట్ నిర్మాణదారులతో ఈ అధికారులు సెటిల్మెంట్స్ చేసుకుంటున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.అయితే జనగామ మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ప్రశాంతిల వ్యవహార శైలి అనుమానాస్పదంగా ఉందనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. ప్రజలు కట్టే పన్నులతో జీతాలు తీసుకుంటున్న బాధ్యత కలిగిన అధికారులు ఇలా అక్రమార్జనకు అలవాటు పడటం ప్రభుత్వ నియమ నిబంధనలను కాలరాయడం పద్ధతి కాదని ప్రభుత్వానికి ఆదాయం తెచ్చేది కాకుండా నష్టం చేస్తున్నారని ప్రభుత్వాన్ని దివాలా తీయించడానికి అవినీతి అధికారులు బాధ్యతలు విస్మరిస్తున్నారని పేర్కొంటున్నారు.

**ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు..**



జనగామ పట్టణంలో ప్రమాదకరంగా మారిన అక్రమ సెల్లార్ నిర్మాణాలను తక్షణమే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ సెల్లార్ నిర్మాణాలు చేసిన నిర్మాణదారులు, వారికి సహకరిస్తున్న మున్సిపల్ అధికారులను కూడా విచారించి శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని స్టేట్ విజిలెన్స్ విచారణ చేయించాలని లేదా ఏసీబీ అధికారుల కు ఈ అవినీతిపై నిఖితపూర్వకంగా కలెక్టర్ ఫిర్యాదు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అసలు ఎన్నెన్ని అక్రమ సెల్లార్ నిర్మాణాలు జరిగాయి.? ఈ నిర్మాణాలకు మున్సిపల్ నుంచి అనుమతులు ఉన్నాయా.? అసలు మున్సిపల్ పరిధిలో సెల్లార్ నిర్మాణాలు చేయవచ్చా.? నిర్మాణదారులు సంబంధిత అధికారులకు ఎవరికీ ఎంతెంత ముట్టజెప్పారు.? అన్న వివరాలను ఆధారాలతో సహా మరో కథనం ద్వారా అందిస్తాం.. కొసమెరుపు ఏమిటంటే అక్రమ సెల్లార్ నిర్మాణదారులు తెలివిగా వ్యవహరిస్తున్నారు. సెల్లార్ నిర్మాణాలు కనిపించకుండా నిర్మాణం ఎంట్రీ గేట్ దగ్గర సిమెంట్ ఇటుకలు పెడుతున్నారు. ఆ తరువాత వాటిని తొలగించి ఆ తరువాత బిజినెస్ సమయాల్లో కారు పార్కింగ్ లు ఏర్పాటు చేసి కనిపించకుండా జాగ్రత్తలు పడుతూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు.

# సకల దేవతలకు ఆదిదేవత గాయత్రి మాత

**(శరన్నవరాత్రులలో రెండవ రోజు)**

**శ్రీశ్రీ ఓం భూర్భువస్సువః ఓం తత్సవితుర్వరేణ్యమ్ శ్రీ భర్గో దేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ శ్రీశ్రీ**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు నేడు గాయత్రీ దేవిగా దర్శనం ఇస్తున్నారు. సకల వేదాలకు అధిదేవత అయిన గాయత్రి మాత జగన్మాతగా ప్రసిద్ధి చెందారు. అమ్మవారిని పూజించడానికి నేడు సకల దేవతలు సైతం నిమగ్నమై ఉంటారు. గాయత్రి మాతను పూజించడం ద్వారా సకల ఐశ్వర్యాలను, సకల జ్ఞానాన్ని పొందవచ్చని పురాణాలు చెబుతున్నాయి.

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో రెండవ రోజు అమ్మవారు గాయత్రీ దేవిగా దర్శనమిస్తారు. సకల శక్తికి సకల మంత్రాలకు ఆదిమూలం గాయత్రీ అమ్మవారు. గాయత్రి మంత్రం పఠించకుండా మనం ఏ పని ప్రారంభించలేము. అమ్మవారిని సకల దేవతలకు అధిదేవతగా చెబుతుంటారు. సకల మంత్రాలకు వేదాలకు ప్రతిరూపంగా గాయత్రీ అమ్మవారిని పూజిస్తారు. అంతటి శక్తివంతమైన అమ్మవారిని నేడు పూజించినట్లయితే జ్ఞానము ఐశ్వర్యము లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. దసరా శరన్నవరాత్రులలో రెండవ రోజు అమ్మవారు గాయత్రీ దేవిగా దర్శనం ఇస్తారు. అమ్మవారిని ఈరోజు నారింజ రంగు వస్త్రంతో అలంకరిస్తారు. అలాగే కనకాంబరం పూలతో పూజించాలి. సకల వేద స్వరూపం గాయత్రి దేవి. అన్ని మంత్రాలకు మూల శక్తి ఈ మాత. ముక్త, విదుమ్ర, హేమ, నీల, ధవళ వర్ణాలు కలిగిన అయిదు ముఖాలతో, శంఖం, చక్రం, గద, అంకుశం ధరించి దర్శనమిస్తుంది. ఆది శంకరులు గాయత్రీదేవి ని అనంతశక్తి స్వరూపంగా అర్చించారు. ప్రాతః కాలంలో గాయత్రిగాను, మధ్యాహ్న కాలంలో సావిత్రిగా, సాయం సంధ్యలో సరస్వతిగాను ఈమె ఉపాసకులతో ఆరాధనలు అందుకుంటుంది. ముఖంలో అగ్ని, శిరస్సులో బ్రహ్మ, హృదయంలో విష్ణువు, శిఖపై



రుద్రుడు కొలువుంటారని పురాణాలు చెబుతున్నాయి. గాయత్రి మాతను ధ్యానిస్తే అనంత మంత్ర శక్తి కలుగుతుందని భక్తుల సంపూర్ణ విశ్వాసం. సకల మంత్రాలకు, అనుష్ఠానాలకు, వేదాలకు మూలదేవతగా గాయత్రీదేవి ప్రసిద్ధి. సమస్త దేవతలకు నివేదన చేయబోయే పదార్థాలన్నింటినీ ముందుగా గాయత్రీ మంత్రంతో నివేదన చేస్తారు. అంతటి మహిమాన్వితమైన గాయత్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఐదు ముఖాలతో, వరద అభయ హస్తాలు ధరించి కమలాసనాసీనురాలుగా దర్శనమిస్తుంది. అమ్మను ధ్యానిస్తే అనంత మంత్ర శక్తి, తద్వార బ్రహ్మ జ్ఞానం కలుగుతుంది. సకల దురిత ఉపద్రవాలు శాంతిస్తాయి. గాయత్రీ ఉపాసన వల్ల బుద్ధి తేజోవంతం అవుతుంది. గాయత్రీ మంత్రజపం చతుర్వేద పారాయణ ఫలితాన్ని ఇస్తుంది



**రవికుమార్ సంతోజు**
**బడంగ్ పేట్. రంగారెడ్డి (జిల్లా)**

# బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు గ్రీవెన్స్ డే

**- ఎస్పీ అశోక్ కుమార్**



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 8 మంది అర్జీదారులతో ఎస్పీ అశోక్ కుమార్ స్వయంగా కలసి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదుల పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

గ్రీవెన్స్ డే లో వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతో పాటు పెండింగులో లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## బీఆర్ఎస్ కార్యకర్త ను పరామర్శించిన
# మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గం,గంగాధర మండలంలోని మధురానగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త, మాజీ వార్డు సభ్యుడు వేణు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై,ప్రస్తుతం బోయినిపల్లి మండల కేంద్రంలోని వారి బంధువుల ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో, సోమవారం చొప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకె రవిశంకర్ బోయినిపల్లి కి విచ్చేసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని,పరామర్శించి,వేణు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శలో వారి వెంట బీఆర్ఎస్ బోయినిపల్లి మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్,నాయకులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, భీమనాతుని రమేష్,అక్కెనపల్లి కరుణాకర్, బొజ్జ ప్రభాకర్,కన్నం సాగర్, బత్తిని కమల్ గౌడ్,పెగ్గర్ల శేఖర్, పొత్తూరి రాజేంద్రప్రసాద్, దూస మధు తదితర నాయకులు ఉన్నారు.

## చొప్పదండి నియోజకవర్గం సంక్షేమాభివృద్ధికి
# కృషి చేస్తున్న ఎమ్మెల్యే సత్యం

- పోచమ్మ ఆలయానికి బోరు బావి నిధులు మంజూరు - బోరుబావి ఏర్పాటు
- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు : వన్నెల రమణారెడ్డి
- ఎమ్మెల్యే సత్యం కు కృతజ్ఞతలు తెలిపిన ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని స్తంభంపల్లి గ్రామంలో శ్రీ పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణంలో భాగంగా బోరు బావి ఏర్పాటుకు చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయగా ఎమ్మెల్యే సత్యం ఆదేశాల మేరకు సోమవారం పోచమ్మతల్లి ఆలయం వద్ద బోరు బావి పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి,స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించి,కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెన్నెల రమణారెడ్డి మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం నియోజకవర్గం సంక్షేమాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని,గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు నిర్వహించేందుకు ఎమ్మెల్యే సత్యం విశేషంగా కృషి చేస్తారని, ప్రజా సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్తంభంపల్లి మాజీ ఎంపిటిసి అక్కెనపల్లి ఉపేందర్, గ్రామ శాఖ అధ్యక్షులు చంద్రగిరి వెంకటేష్, ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ అల్లూరి నరసింహారెడ్డి, మల్కాపురం మాజీ సర్పంచ్ కోరెపు నరేష్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ మెరుపుల మహేష్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు చింతలకోట శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కస్తూరి బాపురెడ్డి, బోయినిపల్లి మండల గౌడ సంఘం అధ్యక్షులు బొంగాని అశోక్ గౌడ్, కందాడి కిరణ్ రెడ్డి, గంగాధర వెంకటరమణ, అక్కెనపల్లి అశోక్,అక్కెనపల్లి బానయ్య, లక్ష్మీరాజం, అక్కెనపల్లి లింగయ్య తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలు,ఆలయ కమిటీ సభ్యులు తమ గ్రామానికి బోరు బావి మంజూరు చేసిన ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# విజయదశమి మహోత్సవానికి ఆహ్వానం



కూకట్ పల్లి(ప్రశ్నన్యూస్) విజయదశమి మహోత్సవాన్ని పురస్కరించుకొని నిజాంపేట కనక దుర్గ అమ్మవారి ఆలయం లో జరగనున్న నవరాత్రి ఉత్సవాలకు ఆలయ కమిటీ ఆహ్వానం పలికింది. సోమవారం 22నుండి 2వ తేదీ గురువారం వరకు అమ్మవారు వరుసగా బాలత్రిపుర సుందరి అమ్మవారు,కుమారి దేవి అమ్మవారు,ప్రత్యాంగిర దేవి అమ్మవారు, శివానంద దేవి అమ్మవారు, మహాలక్ష్మి అమ్మవారు, వారహి దేవి అమ్మవారు, కౌశికాదేవి అమ్మవారు, సరస్వతి దేవి అమ్మవారు, దుర్గామాత దేవి అమ్మవారు, మహిషాశురవర్ధిని దేవి అమ్మవారి, రాజరాజేశ్వరి దేవి అమ్మవారిలా దర్శనం ఇవ్వనున్నారు. ప్రతీ రోజు ఉదయం 6గంటలకు ఛండి పాసుపత హోమము, మధ్యాహ్నం 12గంటలకు మహానివేదన అన్నదానము,మధ్యాహ్నం 4గంటలకు లలిత సహస్త్ర నామ పారాయణం, రాత్రి 8గంటలకు సువర్ణ పుష్పార్చన జరగనున్నట్లు తెలిపారు. భక్తులు తగు సమయం లో ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదములు స్వీరించి అమ్మవారి కృపవీక్షణలో తరించగలిసింది గా ఆలయ ధర్మకర్త కొలను శ్రీనివాస్ రెడ్డి,కొలను నర్సింహారెడ్డి, కొలను గోపాల్ రెడ్డి, శెనిగల సాయిలు యాదవ్, మేకల వెంకటేశం, బుర్ర అశోక్, గ్రామ పెద్దలు కోరారు.

# జగన్మాతణమాస్తుతే

ముగ్గురమ్మల మూలపుటమ్మను భక్తిశ్రద్ధలతో ఆరాధించే పుణ్యదినాలే శరన్నవరాత్రులు. సదా మనల్ని సంరక్షించే అమ్మవారిని ప్రత్యేకంగా పూజించే శుభ సమయమిది. అహంకారంతో విర్రవీగిన మహిషాసురుని సంహరించి లోకాలకు సుఖసంతోషాలను చేకూర్చిన శక్తికి యథాశక్తి కృతజ్ఞతలను తెలియజేసే సందర్భమిది. ఆ జగన్మాతన మనసారా శరణువేడే తరుణమిది.

శరత్కాలే మహా పూజా క్రియతే యా చ వార్షికీ తస్యాంమమైతన్మాహాత్మ్యం శ్రుత్వా భక్తి సమన్వితఃదుర్గాసప్తశతి'లోని ఈ శ్లోకాన్ని శరన్నవరాత్రుల్లో పఠించడం శ్రేష్ఠం. మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతిగా అమ్మవారిని నియమనిష్టలతో పూజిస్తే ఈతిబాధలు తొలగి సకల అభీష్టాలూ నెరవేరతాయన్నది పురాణోక్తి. శైలపుత్రి పార్వతి పరమశివుణ్ణి పొందేందుకు కఠోర తపస్సు చేసింది. ఆ అమ్మ తన పతీశ్వరుని చేరే సమయం కోసం సమస్త లోకాలూ ఎదురుచూశాయి. వారి కుమారసంభవం. తారకాసురుని వధించేందుకు హేతువు కాగలదని ఆశపడ్డాయి. నిర్వికారామ ధ్యానముద్రలో మునిగిన శంకరుని అందుకు ప్రేరేపించటానికి మన్మథుని సాయం కోరారు. వారి కోరిక సఫలమైంది. తారక వధ జరిగింది. అయితే ముక్కంటి కంటిమంటతో బూడిదగా మారాడు పుష్పబాణుడైన మన్మథుడు. ఆ భస్మం నుంచే భండాసురుడనే రాక్షసుడు ఆవిర్భవించాడు. తన సోద విషంగుడు, విశుక్రుడు మొదలైన వేలాదిమంది రాక్షసుల విశ్వవిధ్వంసకారుడు అయ్యాడు. లోకాలన్నీ పరాశక్తిని శరణువేడాయి. ఆమె నుంచి తొమ్మిదేళ్ల బాలిక బాలాత్రిపురసుందరి అవతరించి వారి ప్రాణాలను హరించింది. లోకానికి శాంతినిచ్చింది. మహాలక్ష్మిగా మధుకైటభుని నశింపచేస్తే.. వాగ్దేవిగా ధూమ్రలోచనుని అంతమొందించింది.

### మరణం రాకుండా వరం..

రాక్షసజాతి మూలకర్త దనువు. ఆతడి మనవడు మహిషుడు అమరత్వం సాధించాలనే తపనతో బ్రహ్మ గురించి తపస్సు చేశాడు. మరణం సంభవించకుండా వరం కోరుకున్నాడు. బహ్మదేవుడు ప్రత్యామ్నాయం ఆలోచించమన్నప్పుడు.. స్త్రీలు తనను చంపలేరన్న ఆలోచనతో.. వారు తప్ప మరెవరి చేతిలోనూ మరణం రాకూడదని కోరాడు. తనకిక మరణంలేదని విర్రవీగుతూ భోగలాలసతో ముల్లోకాలనూ పీడించసాగాడు. అప్పుడు సర్వదేవతాశక్తిగా అష్టాదశభుజదేవి ఆవిర్భవించింది. దండనాథ, వారాహి, వైష్ణవి, చాముండి, మంత్రిణి.. ఇలా సర్వసైన్య నాయికలతో మహిషుడిపై యుద్ధం ప్రకటించింది. అతిశయించిన గర్వంతో అహంకారంతో, అతివను సౌందర్యసాధనంగానే భావించి కామదృష్టితో చూస్తున్న మహిషుడి సేనపైకి విరుచుకుపడింది. చాముండి, కాళిక వెంటరాగా భీకరయుద్ధంలో మహిషుడి తల నరికి సమస్త లోకాలకు అభయాన్నిచ్చింది. విజయదశమినాడు ప్రబలగా మహిషాసురమర్దిని అవతరించింది. సీతమ్మవారిని అపహరించిన రావణాసురుణ్ణి శ్రీరామచంద్రుడు హతమార్చింది విజయదశమినాడే అని తెలియజేసే పౌరాణిక కథలూ ప్రచారంలో ఉన్నాయి.

### క్షమించి దీవిస్తుంది:

'కుపుత్రో జాయేత్ తత్ క్వచిదపి కుమాతా న భవతి' అన్నారు. పుత్రుడు చెడ్డవాడైనప్పటికీ తల్లి చూపే ప్రేమ, కరుణ అచంచలం, అపారం.. తన బిడ్డలైన భక్తులు పొరపాట్లు చేసినప్పటికీ క్షమించి దీవిస్తుంది- అన్నది ఆదిశంకరాచార్యుల వారి భావన.

### మత్సమః పాతకీ పాపఘ్నీత్వత్సమా న హి:

ఏవం జ్ఞాత్వా మహాదేవి యథా యోగ్యం తథా కురునా అంతటి పాపాత్ముడు లేడు. పాపాలను తొలగించే నీ అంతటి తల్లి లేదు. సర్వం తెలిసినదానివి కనుక.. నాకు ఏది అర్హత ఉందో దాన్ని కలిగేలా చెయ్యి- అన్నది 'దేవీ అపరాధ క్షమాపణ స్తోత్రం'లోని ఈ శ్లోకానికి అర్థం.

### మహిషుడి నుంచి మనుషుల వరకూ..

నేనే కర్తను, ఈ పనిని నేనే చేశాను, సర్వసమర్థుణ్ణి- లాంటి అహంకారపూరిత ఆలోచనలతో మనిషి తనకు తానుగా బందీ అవుతున్నాడు. 'మోహ మూలం అహంకారః' అన్నది ఉపనిషత్తు వాక్యం. ఆ అహంకారానికి పుట్టినవే అరిషడ్వర్గాలు. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు అంతశ్శత్రువులు. మహిషుడి నుంచి మనుషుల వరకూ వాటి చేతిలో ఓడనివారు ఉండరు. సకలశాస్త్ర కోవిదుడైనప్పటికీ కామం వల్ల రావణుడు ఎందరో స్త్రీలను చెరబట్టి కోరి వినాశనాన్ని తెచ్చుకున్నాడు. క్రోధంవల్ల విశ్వామిత్రుడు వశిష్టుని వందమంది కుమారులను వధించి తీవ్ర పశ్చాత్తాపంతో కుంగిపోయాడు. ఐదు ఊళ్లైనా ఇవ్వమని అడిగిన పాండుపుత్రుల అభ్యర్థనను లోభంతో తిరస్కరించాడు దుర్యోధనుడు. అది కురుక్షేత్రానికి దారితీసింది. శుంభనిశుంభులు అన్యోన్య సోదరులు. స్త్రీ వ్యామోహం వారి ఎడబాటుకే కాదు చావుకూ కారణమైంది. కార్తవీర్యార్జునుడనే రాజు తలకెక్కిన మదం వల్ల పరశురాముడి చేతిలో 21 సార్లు భూమండలం మీదున్న రాజవంశాలు అంతమయ్యాయి. శ్రీకృష్ణభగవానుడి వైభవాన్ని చూసి మత్సరంతో రగిలిపోయాడు శిశుపాలుడు. నూరు తప్పులు దాటాక.. శిక్ష పొందాడు. దైవం పట్ల నిరంతర కృతజ్ఞతాభావం చూపాల్సిన మనసును కలుషితంచేసేదే ఈ అరిషడ్వర్గం. సానుకూల దృక్పథం, ప్రకృతి పట్ల ప్రేమ, ధర్మాచరణ ఈ శత్రుమూకను తరిమేసి విజయాన్ని చేకూర్చగలవు. తనకు భిక్ష వేసిన గృహిణి పట్ల ఆర్ద్రమైంది బాలశంకరుల హృదయం. నిస్వార్థ భక్తితో అమ్మవారిని స్తుతించగా.. ఆయన వాక్కుకు అధీనమై కనకధారలను కురిపించింది జగన్మాత. కంచికి చెందిన మహా భక్తుడైన మూకశంకరులు ధర్మప్రవర్తనతో తదేకదీక్షతో ఆ దేవిని ధ్యానించి, దర్శించి ధన్యమయ్యారు. అలాంటి మహాత్ముల స్ఫూర్తితో, చెదరని భక్తితో మనమంతా అమ్మను ఆశ్రయిద్దాం. ధర్మరక్షణా శక్తినిమ్మని వేడుకుందాం.



"ప్రజా ప్రశ్న " ప్రత్యేక కథనం
" మేడ్చల్ ప్రతినిధి చిన్న

# కంటోన్మెంట్ సిఇవో,డిఇవోతో ఎమ్మెల్యే శ్రీ గణేష్ భేటీ

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నెలకొన్న మౌళిక సమస్యలు పై ప్రతి నెల 10వ తేదీన నిర్వహించే కంటోన్మెంట్ వాణి కార్యక్రమానికి విశేష స్పందన రావడంతో, స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ కి మరింత బాధ్యత పెరిగింది. ఈ నేపథ్యంలో వివిధ శాఖలకి చెందిన అధికారులతో భేటీ అయ్యి మొన్నటి ప్రజల ఫిర్యాదుల పై చర్చించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బస్తీలలో, కాలనీలలో వచ్చిన బురదతో ఇబ్బందులపై,కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నిన్న కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో సిఇవో మధుకర్ నాయక్,హెల్త్ డిపార్ట్మెంట్ అధికారి దేవేందర్, వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ అధికారి రాజ్ కుమార్ తో సమావేశం అయ్యారు. క్రిస్టియన్ సెమెట్రీ గురించి డిఫెన్స్ ఎస్టేట్ ఆఫీసర్ దినేష్ రెడ్డితో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తేలుకుంటసతీష్ తదితరులు పాల్గొన్నారు.

### 97 లక్షల స్టేట్ స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ తో సిసి రహదారి నిర్మాణం....

బొల్లారం వార్డు ఎనిమిదిలోని గంగపుత్ర సంఘం కార్యాలయం నుంచి కార్గిల్ వార్ రామచంద్ర స్టాట్యూ వరకు స్టేట్ గవర్నమెంట్ స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ తొంభై ఏడు లక్షల రూపాయలతో వేయనున్న సిమెంట్ రహదారి నిర్మాణ పనులను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్,బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్ కలిసి సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. పూజ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ రోడ్డు ఏళ్ళనుంచి నిర్లక్ష్యానికి గురైందని,స్టేట్ గవర్నమెంట్ స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ 97 లక్షల రూపాయలతో చేపడుతున్న ఈ రహదారి నిర్మాణం వల్ల ఈ ప్రాంత వాసులకు ఎంతో ప్రయోజనం కల్గుతుంది అన్నారు. మరిన్ని స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ ను రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకువచ్చి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కదిర్వన్, బాలరాజు, రామ్, శ్రీనివాస్, ప్రేమ్, హయత్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

### 27 న నారాయణ జోపిడి డబుల్ బెడ్ రూం ఇళ్ళ పంపిణీ....



సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన రసూల్ పుర నారాయణ జోపిడిలో 288, సిల్వర్ కాంపౌండ్ లో 40, మొత్తం 328 నూతన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. నిన్న సోమవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ క్షేత్రస్థాయిలో లబ్దిదారులు,అధికారులతో కలిసి బస్తీలో పర్యటించారు. ఎమ్మెల్యే వెంట జిహెచ్ఎంసి హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీందర్ ,డిఈ సంధ్య, ఏఈ మహేష్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఏడిఈ నాగరాజు, ఎమ్మార్వో పాండు నాయక్, కంటోన్మెంట్ అధికారి శశాంక్ తదితరులు ఉన్నారు. ఇళ్ల సముదాయాన్ని పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు చేశారు. ఈనెల 27 న ఇళ్లను పంపిణీ చేస్తున్నందున ఒకరోజు ముందే పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని,కాంట్రాక్టర్లకు,అధికారులకు సూచించారు. గృహ నిర్మాణ,రెవెన్యూ శాఖల మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇంఛార్జ్ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్, మేయర్, యంపీలు, ఎమ్మెల్సీలు, ఈ పంపిణీ కార్యక్రమానికి హాజరవుతున్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారులలో ఎటువంటి తారతమ్యం లేకుండా వారి వయస్సును, ఆరోగ్య కారణాలను దృష్టిలో పెట్టుకుని ఇళ్ళ కేటాయింపును ఫ్లోర్ ల వారీగా పారదర్శకంగా కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శాంసన్ రాజు, నరేష్, నయీమ్, మల్లేష్, గౌస్, గఫార్

# టీబి వ్యాధిపై కలత చెందరాదు
## గూడూరు ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా

గూడూరు (ప్రశ్న న్యూస్) టీబి వ్యాధిపై ఎవరు కలత చెంద రాదని తిరుపతి జిల్లా గూడూరు ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా అన్నారు. సోమవారం బైండింగ్ హెూప్ ట్రస్ట్ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నిర్మల్ కుమార్ గత ఐదు సంవత్సరాల నుంచి 500 మందికి ప్రతినెల ఒక్కొక్కరికి 1500 రూపాయల విలువైన న్యూట్రిషన్ ఫుడ్ పాకెట్లు అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ఇచ్చే మందులతో పాటు న్యూట్రిషన్ ఫుడ్ తీసుకుంటే తప్పకుండా వ్యాధి నయమవుతుందన్నారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ ఫుడ్ ప్యాకెట్ తో పాటు స్వయం ఉపాధి పథకాలను కూడా అమలు చేస్తున్నామన్నారు. నిరాశ, భయం లేకుండా ప్రభుత్వం ఇచ్చిన మందులు వేసుకుని ఈ న్యూట్రిషన్ తీసుకుంటే త్వరలోనే జబ్బు నయమవుతుందన్నారు. అనంతరం న్యూట్రిషన్ ఫుడ్ పాకెట్లను



పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రేష్మ, ఏవో కమల్ కిరణ్, ఏ. జయ ప్రకాష్, ఏ.సురేందర్ రెడ్డి, ప్రియాంక, క్రాంతి కుమార్, ఆర్. శకుంతల, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.




# గూస్ బంప్స్ తెప్పిస్తున్న
# కాంతార చాప్టర్ 1 ట్రైలర్..

## సినిమాపై మరింత పెరిగిన అంచనాలు

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కన్నడ బ్లాక్‌బస్టర్ 'కాంతార' సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'కాంతార చాప్టర్ 1' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. హీరోగా, దర్శకుడిగా రిషబ్ శెట్టి మళ్లీ అదే మాంత్రిక ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ విడుదల కాగా, అభిమానులను పూర్తిగా మంత్ర ముగ్ధులను చేసింది. ప్రభాస్ చేతుల మీదుగా విడుదలైన ఈ ట్రైలర్‌లో "నాన్న ఎందుకు ఇక్కడే మాయమయ్యాడు?" అనే డైలాగ్‌తో ట్రైలర్ మొదలవుతుంది. సాంకేతికంగా అత్యద్భుతంగా రూపొందిన ఈ ట్రైలర్ మొత్తం 2 నిమిషాల 56 సెకన్ల నిడివితో సాగుతుంది.గ్రాండ్ విజువల్స్, సాలిడ్ బిజీయం ,షార్ప్ షాట్స్,ఇంటెన్స్ ఎమోషన్స్, ఇవి అన్నీ కలసి ట్రైలర్‌ను అద్భుతంగా మలిచాయి. నేటివిటీ టచ్ మరింతగా ఆసక్తిని రేకెత్తిస్తుండగా, కథలో ఉత్కంఠను పెంచేలా ప్రతి షాట్ రూపుదిద్దుకుంది. మేకింగ్ స్టైల్, విజువల్ నేరేషన్ అన్నీ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ సారి 'కాంతార చాప్టర్ 1'ను పాన్ ఇండియా లెవెల్‌లో రిలీజ్ చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెలుగులో గీత ఆర్ట్స్ ద్వారా రిలీజ్ కానుండగా,నైజాం ప్రాంతంలో ప్రముఖ సంస్థ మైత్రీ ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ హక్కులను దక్కించుకుంది. 'కాంతార' ఫస్ట్ పార్ట్ ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న నేపథ్యంలో, ఈ సీక్వెల్‌పై అభిమానులు, సినీ ప్రేమికులు ఆశలు పెంచుకున్నారు. ట్రైలర్ విడుదల కావడం ద్వారా సినిమాపై ఉన్న ఆసక్తి మరింతగా పెరిగింది. సోషల్ మీడియాలో ట్రైలర్‌కు విశేష స్పందన లభిస్తోంది. మొత్తం మీద, 'కాంతార చాప్టర్ 1' ట్రైలర్ ఎమోషన్, మిస్టరీ, విజువల్స్ అన్ని విభాగాల్లో ముచ్చట పడేలా ఉంది. అప్పటి అరణ్యాల్లో దైవాంశ మూర్తీభవించిన భూతకోల ఆవిర్భావం, తదనంతర ఉత్కంఠభరిత పరిణామాలతో ఈ కథను హై ఇంటెన్సిటీ డివోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కించారని సమాచారం. ముఖ్యంగా క్లైమాక్స్ ఘట్టాల్ని దాదాపు 500 మంది ఫైటర్లు, వారికి సహాయకులు 3000 మంది పాల్గొనగా భారీ స్థాయిలో తెరకెక్కించారని, భారతీయ సినీ చరిత్రలో ఇదొక రికార్డని చెబుతున్నారు. హొంబలే ఫిల్మ్స్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను తెరకెక్కించింది.

# పవన్ కల్యాణ్ "ఓజీ"
# తుపాను మొదలైంది..

## ఫైనల్ ట్రైలర్‌తో మాస్ హంగామా !




హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిన్న (సెప్టెంబర్ 21) జరిగిన ఓజీ ప్రీ-రిలీజ్ ఈవెంట్ అభిమానులకు మరచిపోలేని తీపి జ్ఞాపకాన్ని అందించింది. ఈ ఈవెంట్‌లో ట్రైలర్ రిలీజ్ చేయాలని మేకర్స్ భావించిన పూర్తి వర్క్ కాకపోవడం వలన పోస్ట్ చేయాలని అనుకున్నారు. కాని పవన్ కళ్యాణ్ సూచన మేరకు అప్పటి వరకూ రెడీ అయిన ట్రైలర్‌ను అక్కడే విడుదల చేయడం జరిగింది. ఇక కొద్ది సేపటి క్రితం ఫైనల్ వెర్షన్ OG థియేట్రికల్ ట్రైలర్ విడుదలైంది. ఇది విడుదలవ్వగా సోషల్ మీడియాను, సినిమా వర్గాలను పూర్తిగా షేక్ చేస్తోంది. దర్శకుడు సుజీత్ ఫుల్ మేకోవర్, తమన్ అదిరే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పవన్ కళ్యాణ్ పవర్‌ఫుల్ డైలాగ్స్, విలన్ లుక్స్ ఈ ట్రైలర్‌ను కొత్త రేంజ్‌కి తీసుకెళ్లాయి.ట్రైలర్‌లో పవన్ కళ్యాణ్ గ్యాంగ్‌స్టర్ అవతారం, స్టైల్ , తమన్ మ్యూజిక్ , రిచ్ విజువల్స్ , క్లాస్ టు మాస్ పాకేజింగ్, చివర్లో పవన్ చెప్పిన "నా కొడకల్లారా..!" పంచ్ డైలాగ్ పూనకాలు తెప్పిస్తున్నాయి. ఈ డైలాగ్ విన్నవెంటనే అభిమానుల్లో గూస్‌బంప్స్ పుట్టించడంతో పాటు, ట్రైలర్‌కు ఊహించని రేంజ్‌లో బజ్ తీసుకొచ్చింది. గతంలో "లాస్ట్ పంచ్ మనదైతే వచ్చే కిక్కే వేరప్ప" లాంటి డైలాగ్ ఎంత హైప్ తీసుకువచ్చిందో, ఇదీ అదే స్థాయిలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.ఏపీ డిప్యూటీ సీఎం పదవి చేపట్టిన తర్వాత పవన్ కళ్యాణ్ నుంచి ఈ స్థాయి మాస్ యాంగిల్ రావడం అభిమానుల్లో సంబరాలు తెచ్చిపెట్టింది. రాజకీయంగా బిజీగా ఉన్నప్పటికీ, పవన్ తన అభిమానుల కోసం, OG చిత్రాన్ని పట్టుదలగా తీసుకొని పూర్తి చేశాడు. సినిమా పై ఆయన ఉన్న డెడికేషన్ ట్రైలర్‌తో తెలిసిపోతుంది. ప్రస్తుతం OG ట్రైలర్ ట్రెండింగ్‌లో టాప్‌లో ఉంది. ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ ప్రతి ప్లాట్‌ఫామ్‌లోనూ OG ట్రైలర్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. చాలామంది ఫ్యాన్స్, సినీ విశ్లేషకులు ఒకే మాట అంటున్నారు .."ఇది తొలిరోజే ?100 కోట్లు రాబట్టే సినిమా!" అని కామెంట్ చేస్తున్నారు. సెప్టెంబర్ 25న, విజయదశమి కానుకగా OG గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది. విడుదలకు ముందే ఈ స్థాయిలో హైప్ ఉండడం సినీ ఇండస్ట్రీకి ఒక పెద్ద విషయమే. "గెట్ రెడీ పవన్ కళ్యాణ్ 'ఓజీ'తో తెరపై మాస్ తుఫాన్‌ను ఎవరూ ఆపలేరు అంటూ అభిమానులు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

# నెట్‌ఫ్లిక్స్‌లోనూ అదే దూకుడు..

## మహావతార్ నరసింహ ఉగ్రరూపం




హిందూ పురాణాల నేపథ్యంలో యానిమేటెడ్ సినిమాగా వచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేసింది 'మహావతార్ నరసింహ' . కన్నడ టాప్ ప్రొడక్షన్ హౌస్‌లైన హొంబలే ఫిల్మ్స్, క్లీమ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా తెరకెక్కించాయి. ప్రపంచవ్యాప్తంగా జూలై 25న థియేటర్లలో విడుదలై ఘన విజయాన్ని సొంతం చేసుకోవడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు వసూళ్లను రాబట్టి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది.అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ మూవీ ప్రస్తుతం పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో సెప్టెంబర్ 19 నుంచి పలు భారతీయ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. కాగా ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లోనూ తన దూకుడు ప్రదర్శిస్తోంది. నెట్‌ఫ్లిక్స్ ఇండియాలో టాప్ ప్లేస్‌లో ట్రెండింగ్ అవుతోంది. ముందుగా అంతా ఊహించినట్టుగానే అద్భుతమైన వ్యూయర్‌షిప్‌తో డిజిటల్ ప్లాట్‌ఫాంలో కూడా దండయాత్ర కొనసాగిస్తోంది. అశ్విన్ కుమార్ స్టోరీ టెల్లింగ్, సాలిడ్ విజువల్స్‌కు కుటుంబ ప్రేక్షకులు, చిన్నారులు ఫిదా అయిపోతున్నారు.హిందూ పురాణాలలోని శ్రీమహావిష్ణువు దశావతారాలను ఆధారంగా చేసుకుని ఏడు భాగాలుగా రూపొందించే 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్'లో ఫస్ట్ పార్టుగా వచ్చింది మహావతార్ నరసింహ. ఈ ఫ్రాంచైజీలో రాబోయే నెక్స్ట్ పార్టులపై అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి.



# మీనాక్షి చౌదరి
# ట్రావెల్ డైరీ స్పెషల్..

## ఇంతకీ లక్కీ భాస్కర్ హీరోయిన్ ఎక్కడికెళ్లిందో తెలుసా..?

ఇచట వాహనములు నిలుపరాదు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది హర్యానా సుందరి మీనాక్షి చౌదరి. ఆ తర్వాత హిట్ 2, గుంటూరు కారం సినిమాలతో హిట్స్‌ను ఖాతాలో వేసుకుంది. గతేడాది మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించిన లక్కీ భాస్కర్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించింది.ఎప్పుడూ ఏదో ఒక ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌తో ఫుల్ బిజీగా ఉండే ఈ భామ కాస్త బ్రేక్ తీసుకొని వెకేషన్ టూర్ ప్లాన్ చేసుకుంది. ఇంతకీ మీనాక్షి చౌదరి ఎక్కడికెళ్లిందనుకుంటున్నారా..? ఈ భామ జపాన్ దేశానికి టూర్ వేసింది. స్టైలిష్ డ్రెస్‌లో ఉన్న మీనాక్షి జపాన్ వీధుల్లో వర్షం పడుతుంటే గొడుగు పట్టుకొని మాన్‌సూన్ అందాలను ఆస్వాదించింది. ఈ ఫొటోలపై మీరూ ఓ లుక్కేయండి మరి.ఓ వైపు ధమక్కుమని మెరుస్తున్న చెవిపోగులు, మరోవైపు సాధారణ పోనీటైల్ లాంటి జుట్టుతో ఉన్న ఈ చిన్నది అందమైన చిరునవ్వుతో అందరినీ ఆకర్షిస్తోంది. ప్రతీ వీధిలో మీనాక్షి చౌదరి దిగిన ఫొటోలు జపాన్ టూర్‌ను ఎలా ఎంజాయ్ చేసిందో చెప్పకనే చెబుతున్నాయి. జపాన్ వెకేషన్‌లోని ప్రతీ ఫ్రేమ్ తన ట్రావెల్ డైరీలో ప్రత్యేకంగా నిలిచిపోయేలా కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది.'కొన్ని యాదృచ్ఛిక విషయాలు, సంఘటనలు మనలో శాశ్వత ముద్ర వేస్తాయి. ఈ అద్భుతమైన రోజు నుండి నాకు అలాంటి ఒక జ్ఞాపకం లభించినందుకు నేను కృతజ్ఞురాలినని భావిస్తున్నాను. జపాన్‌లో మేము ఒక అందమైన కేఫ్‌ను గుర్తించాం. అద్భుతమైన వర్షాభావ దృశ్యాల నుండి అక్కడి అందమైన మనుషులతో అందంగా తయారు చేసిన జపనీస్ టీ వరకు అన్నీ ఆస్వాదించాం' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో క్యాప్షన్ పెట్టింది.ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న మీనాక్షి చౌదరి. ప్రస్తుతం అనగనగా ఒక రాజు సినిమాలో నటిస్తోంది.

# వెంకటేశ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ ఫన్ రైడ్..
# వెంకీ 77 సెట్స్‌పైకి వెళ్లే టైం ఫిక్స్..!

వెంకటేశ్, త్రివిక్రమ్ శ్రీనివాస్.. టాలీవుడ్‌లో ఈ కాంబినేషన్‌కు ఉన్న క్రేజే వేరు. త్రివిక్రమ్ శ్రీనివాస్ డైలాగ్స్ అందించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి సినిమాలు ఆల్‌టైమ్ ఎవర్‌గ్రీన్ సూపర్ హిట్ సినిమాల జాబితాలో ఉంటాయి. ఇక ఈ ఇద్దరూ కలిసి కొత్త సినిమాకు ఫుల్ టైం పనిచేయబోతున్నారని తెలిసిందే. వెంకీ 77 వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రాండ్‌గా లాంచ్ అయింది.కాగా ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందా..? అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం అదిరిపోయే న్యూస్ ఒకటి తెరపైకి వచ్చింది. తాజా కథనాల ప్రకారం వెంకీ 77 అక్టోబర్ మొదటి వారంలో సెట్స్‌పైకి వెళ్లనుంది. హైదరాబాద్‌లో ఫస్ట్ షెడ్యూల్ కొనసాగనుందట. అంతేకాదు కేజీఎఫ్ ఫేం శ్రీనిధి శెట్టిని హీరోయిన్‌గా ఫైనల్ చేయనున్నట్టు ఫిలింనగర్ సర్కిల్‌లో వార్తలు రౌండప్ చేస్తుండగా.. ఈ వార్తలపై త్రివిక్రమ్ టీం నుంచి అఫీషియన్ అనౌన్స్‌మెంట్ వస్తుందా..? అనేది తెలియాల్సి ఉంది.ఈ మూవీని హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సీనియర్ నిర్మాత ఎస్ రాధాకృష్ణ తెరకెక్కించనున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించనున్నాడని తెలుస్తుండగా.. మేకర్స్ నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్‌ను ఖాతాలో వేసుకున్నాడు వెంకీ. మరి త్రివిక్రమ్-వెంకీ కాంబో ఎలాంటి వినోదాన్ని అందించబోతుందనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది.



# పురాతన ఆలయ పునరుద్ధరణకు శ్రీకారం చుట్టిన బిజెపి నాయకులు

**- కాశిపేట ఆలయాన్ని శుభ్రపరచిన బిజెపి నాయకులు**

**- ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి**





మంథని( ప్రశ్న న్యూస్) అతి ప్రాచీనమైన ఆలయాలను పునరుద్ధరించే దిశగా భారతీయ జనతా పార్టీ నడుం బిగించింది. ఇందులో భాగంగా సోమవారం మంథని మండలం గుంజపడుగు గ్రామ శివారులో గల అతి ప్రాచీనమైన కాశీపేట దేవాలయాలను పునరుద్ధరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కేంద్ర, రాష్ట్ర శాఖ ఆలోచనలో భాగంగా బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి ఆదేశాల మేరకు కాసిపేట గుడి ఆవరణలో సేవ పక్వాడ్ 2025 లో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. మండల కన్వీనర్ చిదురాల మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు కార్యకర్తలు పురాతన ఆలయం ఆవరణలోని పిచ్చి మొక్కలను చెత్తాచెదారాన్ని, అలాగే గుడి శిఖరం పై మునిగిసిన మొక్కలను పూర్తిగా తొలగించారు. ఒకప్పుడు ఎంతో ప్రసిద్ధిగాంచిన ఈ కాజీపేట ఆలయం ప్రభుత్వ ఆదరణ కోల్పోవడంతో ఆలయంలోని శ్రీ సీతారామచంద్రల విగ్రహాలను, ఆలయంలోని శివలింగాన్ని పెదిలించి గుప్త నిధుల కోసం కొందరు దుశ్చర్యకు పాల్పడ్డారు. ఈ ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మంథని పట్టణ అధ్యక్షుడు సబ్బాని సంతోష్, మండల అధ్యక్షులు వీరబోయిన రాజేందర్, మండల ప్రధాన కార్యదర్శి బూడిద రాజు, మండల కార్యదర్శి బూడిద విష్ణువర్ధన్, మండల కోశాధికారి గుమ్మడి శ్రీనివాస్, బూత్ అధ్యక్షుడు మణుగు కొమరయ్య, వీరబోయిన రవీందర్, చౌటపల్లి నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల కారణంగా నష్టపోయిన
# బాధితులను ఆదుకోవాలి

**సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్**



అడ్డగుట్ట (ప్రశ్న న్యూస్)సిపిఐ సికింద్రాబాద్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో మారేడుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ముందు నియోజకవర్గ పరిధిలో భారీ వర్షాల వల్ల నష్టపోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సికింద్రాబాద్ నియోజకవర్గ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ వరుసగా కురుస్తున్న భారీ వర్షాల మూలంగా సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో భారీగా ఆస్తి నష్టం జరిగిందని పేదలు వర్షాల కారణంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కావున అధికారులు ముంపు ప్రాంతాలలో పర్యటించి నష్టపోయిన వారి కుటుంబాలకి 25 వేల రూపాయలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, బాధిత ప్రాంతాలలో నష్ట నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.భారీ వర్షాల కారణంగా ఇండ్లు ధ్వంసమై నిరాదరణకు గురైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్వో కి సమస్యలను వివరిస్తూ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ సికింద్రాబాద్ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు, గౌరీ నాగరాజ్, పాకాల యాదగిరి, సయ్యద్ గౌస్, లెనిన్ , కొండల్, యాదగిరి, రవికాంత్, శ్రీనివాస్, ఖలీల్,తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల వలయంలో మంథని డిపో.

**మంథని డిపోను నిర్వీర్యం చేస్తున్న మేనేజర్..**

**ఆర్టీసీ డిపోను అధోగతి చేస్తున్న డిపో మేనేజర్...**

**డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేస్తున్న వైనం...**

**కొత్త బస్సును వేరే డిపోకు పంపిస్తూ...**

**పాత బస్సులను తెస్తున్న మేనేజర్...**



మంథని( ప్రశ్న న్యూస్)మంథని ఆర్టీసీ డిపోను మేనేజర్ ను నిర్వీర్యం చేస్తున్నట్లు మంథని ఆర్టీసీ డిపోను చూస్తేనే తెలుస్తోంది.గోదావరి ఖని, కరీంనగర్, భూపాలపల్లి నుండి రాత్రి వేళల్లో బస్సు అందుబాటులో ఉండడం లేదని ఆర్టీసీ ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షిస్తున్నారని మంథని ఆర్టీసీ డిపో లో బస్సుల సంఖ్యను పెంచాలని స్థానికుల నుండి ప్రజా సంఘాల నుండి ఇటీవల వినతులు కూడా వెళ్ళాయి. దీంతో ప్రయాణికుల నుండి రోజు రోజుకు విమర్శలు వినిపిస్తున్నాయి. డిపో మేనేజర్ పాత బస్సులను నడిపిస్తూ... కొత్త బస్సులను వేరే చోటుకు పంపించడంతో పాత బస్సులు మార్గ మధ్యలో ఆగిపోతున్నాయి. బస్సు కండిషన్ చూడడంలో విఫలమయ్యారు. ఆర్టీసీ మహిళ కండక్టర్ ల మీద ఒత్తిడి తెస్తూ... ప్రయాణికులు స్కానర్ చేసిన డబ్బులు... క్యాష్ రూపంలో తెలవాలని ఒత్తిడీ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పితృ మాసంలో కూడా కండక్టర్ లకు ఒక పూట సెలవు ఇవ్వకుండా టార్గెట్ ల కోరకు ఒత్తిడి చేస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి.పాత బస్సుల కండిషన్ ల చూడడం లేదని దీంతో బస్సు మార్గ మధ్యలో ఆగిపోతున్నాయి. అదే విధంగా డీజల్ అదా చేయాలని డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. లక్ష కిలోమీటర్ల కూడా ప్రయాణం చేయని ఎక్స్ ప్రెస్ ను గోదావరిఖని పంపిస్తూ... కరీంనగర్ నుండి పాత బస్సు లను మంథని డిపో కు తెచ్చి... అవి పని చేయకున్నా పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. దీంతో మంథని ఆర్టీసీ డిపో మాత్రం సమస్యలతో కూడుకొని ఉన్నదని ప్రయాణికుల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి.

# జీఎస్టీపై బీజేపీ సంబరాలు హాస్యాస్పదం

**- ప్రధాని అవాస్ యోజన లబ్ధిదారులకు రూ.2 లక్షలు ఇవ్వాలి**

**- ఎమ్మార్పీఎస్ యూత్ సెల్ జిల్లాధ్యక్షులు**

**- దీకొండ కుమారస్వామి మాదిగ**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) జీఎస్టీ పెంపు – తగ్గింపులపై బీజేపీ ,కేంద్ర ప్రభుత్వం చేస్తున్న రాజకీయ నాటకం దేశ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనని ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా యూత్ అధ్యక్షులు దీకొండ కుమారస్వామి విమర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "తానే పెంచిన జీఎస్టీని మళ్లీ తగ్గించి సంబరాలు చేసుకోవడం అంటే ప్రజలతో ఆటలాడటమే. మేమే పెంచుతాము, మేమే తగ్గిస్తాము... అని హడావుడి చేయడం హాస్యాస్పదం. ఇది కాదు ప్రజలకు కావాల్సింది" అని తీవ్రంగా వ్యాఖ్యానించారు.ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలు ఆరోగ్యం, విద్య, ఉద్యోగాల లోపమేనని ఆయన స్పష్టం చేశారు. "యువతకు ఉపాధి అవకాశాలు, విద్యలో నాణ్యత, పేదలకు వైద్య సౌకర్యాలు ఇవ్వడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలి. పన్ను తగ్గింపులాంటి పైకి కనిపించే నిర్ణయాలతో ప్రజల సమస్యలు పరిష్కారం కావు" అని ఆయన పేర్కొన్నారు.అదేవిధంగా, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లను నిర్మించుకునే ప్రతి లబ్ధిదారునికి కనీసం రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "ఇల్లు అనేది ప్రతి పేద మనిషి కల. దానికి తగిన ఆర్థిక మద్దతు ఇవ్వడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత" అని దీకొండ కుమారస్వామి అన్నారు.బీజేపీ ప్రభుత్వానికి జీఎస్టీపై సంబరాలు చేసుకోవడం కాకుండా ప్రజల కోసం నిజమైన సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం అవసరమని కుమారస్వామి తీవ్రంగా డిమాండ్ చేశారు.

## క్రైమ్స్ అదనపు డీసీపీ గా బాధ్యతలు చేపట్టిన బాలస్వామి



జనగామ (ప్రశ్న న్యూస్) వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైమ్స్, ఆపరేషన్ విభాగం నూతన అదనపు డీసీపీగా జి. బాలస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పాగుచ్ఛం అందజేశారు. అదనపు డీసీపీ బాలస్వామి గతంలో వరంగల్ పోలీస్ కమిషరేట్ లో ట్రాఫిక్ ఏసీపీగా పనిచేశారు..

# ఆర్ఎంపీ డాక్టర్ నిర్లక్ష్యం వల్ల చిన్నారి మృతి

**సత్య పాలీ క్లినిక్ పేరుతో డాక్టర్ వైద్యం**

**క్లినిక్ ఎదుట కుటుంబ సభ్యులు ఆందోళన**



మేడిపల్లి (ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దేవేంద్ర నగర్ నగర పేస్ –2 లో దారుణం చోటుచేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఆరేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బోడుప్పల్ కార్పొరేషన్ లోని సత్యపాలి క్లినిక్ లో జరిగింది. ఈ ఘటనలో బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే బోడుప్పల్ కార్పొరేషన్ లో నివాసం ఉండే కొండ రాజు లావణ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు పెద్ద కూతురు హాసిని (6 ) వారం రోజులుగా జ్వరం వాంతులు బలహీనత ఉండడంతో పరీక్షలు చేయించక ఆమెకు జాండీస్ అని తేలింది. ఈ నేపథ్యంతో ఆదివారం మధ్యాహ్నం జ్వరం మరింత పెరగడంతో తల్లిదండ్రులు బోడుప్పల్ దేవేందర్ నగర్ లోని సత్యపాలి క్లినిక్ లో చేర్పించారు. చికిత్స చేయడంతో చిన్నారి ప్రాణాలు కోల్పోయిందని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ క్లినిక్ ముందు ఆందోళన నిర్వహించారు. కొండరాజు పెయింటర్ గా తల్లి లావణ్య వాచ్ మెన్ గా పనిచేసుకుంటూ నివసిస్తున్నారు. కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయినారు. వైద్యుడు నీ అరెస్టు చేసి రిమాండ్ చేసినట్టు సిఐ గోవిందరెడ్డి తెలిపారు.

# మాకు న్యాయం చేయండి సార్

**రోడ్డు విస్తరణ కు భూములిచ్చాం**

**సాగుకోసం పాత రోడ్డు స్థలాన్ని ఇవ్వండి**

**ప్రజావాణి లో పిర్యాదు చేసిన అప్పాజీ పల్లి వాసులు**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) కొల్చారం మెదక్ నుండి హైదరాబాద్ వెళ్లేందుకు వేసిన 765 జాతీయ రహదారి నిర్మాణానికి మా స్వంత పట్టభూములు కోల్పోయమని దీనికి గాను పాత రోడ్డు భూమిని కేటాయిస్తే సాగుచేసుకొని జీవనం గడుపుతామని జిల్లా కలెక్టర్ కు సోమవారం ప్రజావాణి లో అప్పాజీ పల్లి భాదితులు పిర్యాదు చేస్తూ వినతి పత్రం అందజేశారు. మా యొక్క పట్టాభూమిని రోడ్డు విస్తరణలో భాగంగా ఇచ్చినందుకు పాత రోడ్డును మాకు వ్యవసాయము చేసుకొనుటకు గతంలో ప్రభుత్వ అధికారులు హామి ఇవ్వడం జరిగిందన్నారు. అప్పాజిపల్లి గ్రామస్థులం మా యొక్క స్వంత పట్టా వ్యవసాయ భూమి కొల్చారం గ్రామ శివారులో గల సర్వే నెం. 908, 901, 906,905 %డ% 904 లలోని పట్టా భూమిని రోడ్డు విస్తరణలో భాగంగ మేము ప్రభుత్వానికి ఇచ్చాము. భూమిని మేము రోడ్డుకు ఇచ్చిన సమయంలో గత ప్రభుత్వ ఎమ్మెల్యే మధన్ రెడ్డి , జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ నర్సాపూర్ మరియు స్థానిక కొల్చారం తహసీల్దార్ లు వచ్చి మేము ఇచ్చిన భూమికి బదులుగా పాత రోడ్డులో గల భూమి మాకు ఇచ్చుటకు ఒప్పుకొని అధికారులు హామి ఇవ్వడం జరిగింది. అధికారుల హామీ మేరకు ఇట్టి భూమిని మేము సాగుచేసుకొనుచున్నాము. కాని తేదీ: 02.09.2025 నాడు కొల్చారం తహసిల్దార్ కార్యాలయానికి చెందిన కొందరు అధికారులు వచ్చి ఇది ప్రభుత్వ భూమి అని ఖడీలు పాతడానికి ప్రయత్నించారు. కావున తమరితో మరోసారి విజ్ఞప్తి చేయడమేమనగా మాకు గతంలో నాయకులు మరియు అధికారులు ఇచ్చిన హామీ మేరకు ఇట్టి భూమిని సాగు చేసుకొనుటకు అధికారులకు అదేశాలు జారీచేసి న్యాయం చేయగలరని కోరుతున్నాం గతంలో కూడా మా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల నిర్మాణము కొరకు "25 గుంటల" పట్టా భూమిని సైతం ఉచితముగా ఇవ్వడం జరిగిందన్నారు. పిర్యాదు చేసిన అప్పాజిపల్లి మాజీ సర్పంచ్ నాయని సునీత వెంకట్ గౌడ్,రైతులు కన్నీబోయిన రామాంజం, కన్నీబోయిన నర్సింలు, యాదయ్య, పోచయ్య ,సురేష్ ,లచ్చయ్య, కన్నీబోయిన యాదయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

## గ్రామపంచాయతి కార్మికులకు
# పెండింగ్ వేతనాలు చెల్లించాలి.

**ఆన్ లైన్ లో పేర్లు లేని వారిని వెంటనే చేర్చాలి.**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) గ్రామపంచాయతి కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆన్ లైన్ లో పేర్లు లేని వారి పేర్లు వెంటనే చేర్చాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు గ్రామ పంచాయతి కార్మికుల ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం అడిషనల్ కలెక్టర్ నగేష్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ పంచాయతి వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కడారి నర్సమ్మ మాట్లాడుతూ.. గ్రామపంచాయతి కార్మికులకు గత 5 నెలల నుండి వేతనాలు ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. అన్ని మతాలకు ముఖ్యమైన పండగ దసరా, బతుకమ్మలు వస్తున్నాయని కార్మికులు చేసిన కష్టం ఇవ్వకుండా ప్రభుత్వం కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. బతుకమ్మ సంబరాలు ప్రారంభమయిన్నప్పటికీ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులకు వేతనాలు చెల్లించకపోతే కార్మికులు పండుగలను ఏ విధంగా జరుపుకుంటారని ప్రశ్నించారు. గ్రామ పంచాయతి కార్మికులు ఉదయం నుండి సాయంత్రం వరకు గ్రామాల్లో ప్రారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ, ఇదే పని మీద ఆధారపడి జీవిస్తున్నారు. వేరే ఆర్థిక అవకాశాలు ఏమీ లేవన్నారు. పండగ పూట కుటుంబానికి బట్టలు కొనాలన్నా, చేతిలో పైసలు లేక, జీతం రాక కార్మికులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. బయట అప్పులు అడిగిన ఎవరూ ఇచ్చే పరిస్థితిలో లేరన్నారు. ప్రతినెల గ్రీన్ ఛానల్ ద్వారా గ్రామపంచాయతి కార్మికులకు వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం గొప్పగా చెప్పినప్పటికీ అమలులో మాత్రం దున్నపోతు మీద వర్షం పడ్డట్టుగా అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. జీతాలు రాక గ్రామపంచాయతీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి జిల్లాలో ఉందన్నారు. కావున ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్రామాలలో పనిచేస్తున్నటువంటి గ్రామ పంచాయతి కార్మికుల అందరి పేర్లు ఆన్ లైన్ లో చేర్చకపోవడంతో పని చేసే దగ్గర ప్రాణపాయం జరిగిన, పని భద్రత లేక, ఎలాంటి సౌకర్యాలు కార్మికులు పొందడం లేదన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి పని చేస్తున్నప్పటికీ గ్రామ కార్మికులు నష్టపోవడం జరుగుతుందన్నారు. పనిచేస్తున్న కార్మికులందరికీ పేర్లను ప్రభుత్వం ఆన్లైన్ లో చేర్చాలని గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సి ఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్, నాయకులు కె. మల్లేశం, దుర్గ, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు మహేందర్, జిల్లా కార్యదర్శి ఆసిఫ్, నాయకులు పద్మారావు, రాములు, పోచయ్య, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి శిబిరానికి
# భారీ స్పందన:ముద్దం నర్సింహా



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) జంటనగరాల్లో ప్రజల జీవన శైలిలో పలు మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తినే ఆహారం నుంచి మొదలు కొని అన్ని విషకూటమైనవే.ఈ నేపథ్యంలో ప్రజల్లో వయస్సుకు సంబంధం లేకుండా రుగ్మతుల వల్ల ఆరోగ్యం క్షీణిస్తుంది.పసి పిల్లలు, నడివయస్సు, వృద్ధాప్యంతో ఇబ్బందులు పడుతున్న వారి సంఖ్య కొక్కోలలుగా ఉండడం శోచనీయమని వైద్యులు చెబుతున్నారు.మరి ముఖ్యంగా కంటి చూపు మందగించి నానారకాలుగా నరకయాతన పడుతున్న నగరజీవి.ఇక విద్యార్థుల విషయానికి వస్తే క్లాసులో ఉండే ముప్పై మందిలో పది మందికి కంటి చూపు సరిగ్గా లేకపోవడంతో కళ్లజోళ్లు పెట్టుకుంటున్నారు.ఇక వృద్ధుల సంగతి గురించి చెప్పనక్కర్లేదు.కంటి చూపు మందగించి కన్న పిల్లలను ఇబ్బందులకు గురి చేయక ప్రభుత్వ కంటి ఆసుపత్రి చుట్టూ ప్రదక్షనలు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్లో అస్మత్ పెట్ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత కంటి పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు.కేరళ మాజీ ముఖ్యమంత్రి ఒమన్ చండి జ్ఞాపకార్థం "పుష్పగిరి ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సికింద్రాబాద్ వారి సహకారంతో " మహేందర్ యాదవ్ బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఉచిత కంటి శిబిరాన్ని ప్రారంభించారు. పుష్పగిరి కంటి ఆత్మస్పత్రికి చెందిన రెండు మొబైల్ వ్యాన్స్.డాక్టర్ ప్రవీణ్,డాక్టర్ వేణు,డాక్టర్ వరుణ్,డాక్టర్ యశ్వంత్ వారి బృందం. యూపిహెచ్సీ అస్మత్ పెట్ ఆస్పత్రి నుండి ఆశ వర్కర్స్ శ్రీదేవి సుమలత టీం.నిన్న కంటి పరీక్షలు చేయించుకున్నారు.శిబిరంలోవైద్య పరీక్షలు చేసుకున్న వారి సంఖ్య 668 మంది.కంటి అద్దాలు అవసరమైన వారు 325 మంది,కంటి ఆపరేషన్ చేయించుకోవాల్సిన వారు 115,ఆపరేషన్ అవసరమైన వారినీ ఈ నెల 26న సాయంత్రం మూడు గంటలకు చేస్తారని స్థానిక కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఇర్ఫాన్ బాయ్, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మన్నే ఉదయ్ యాదవ్, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ ఎజాజ్, డివిజన్ జనరల్ సెక్రెటరీ హరినాథ్,కర్రె జంగయ్య మైపాల్ రెడ్డి,గడ్డం నర్సింగరావు,కేరళ బాబన్న డివిజన్ మహిళా అధ్యక్షురాలు లలిత దుర్గా సంతోషి,పిట్ల రాజు మేకల ఉదయ్ రాజు గౌడ్ కుమ్మరి బాలరాజ్ అశోక్ శ్రీనివాస్ రెడ్డి కే దేవేందర్ బాలయ్య బిక్షపతి అడ్డు ఇలియాస్ మోహన్ గణేష్ చారి శాలిని కవిత సాయి ప్రతాప్ శేఖర్ యాదవ్ బుర్రి యాదగిరి మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అటకెక్కిన రోడ్డు నిబంధనలు

## - రహదారి భద్రతకు తీవ్ర ముప్పు

- నిబంధనలు పాటించక పోవడంతో పెరుగుతున్న ప్రమాధాలు
- నిర్లక్ష్యపు డ్రైవింగే ప్రమాధాలకు కారణం
- పోలీసుల హెచ్చరికలు భేఖాతర్
- నిబంధనలు పాటించని వాహణధారులకు పోటోలతో సరి. మరి కఠిన చర్యలేవి
- కార్యరూపం దాల్చని ప్రత్యేక పోలీస్ స్టేషన్ల ప్రతిపాధనలు





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రోడ్డు నిబంధనలు పాటించక పోవడంతో ప్రమాదాలు పెరిగడమేకాక, రహదారి భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లుతుంది. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించిస్తు బాధ్యతగా వాహణాన్ని నడపాలనే పోలీసులు, రవాణా అధికారులు సూచిస్తున్నను నిబంధనలను పాటించని వాహణదారులు చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో పోలీసు యంత్రాగం పూర్తిగా విఫలమైందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించి, బాధ్యతతో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సంబంధిత అధికారుల సూచలను గాలికి వదిలి ఓవర్ స్పీడ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తో ప్రాణాల మీదకు తెచ్చుకుంటుండగా రాంగ్ సైడ్ డ్రైవింగ్‌తో ఎక్కువ ప్రమాదాలు జరిగుతున్నాయని సమాచారు. నిర్లక్ష్యం డ్రైవింగ్ అత్యంత ప్రమాధకరమని, బైక్ నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించడమే కాక, వెనుక కూర్చున వ్యక్తి సైతం హెల్మెట్ ధరించాలనే నిబందనలను గాలికి వదిలి ప్రాణాపాయ పరిస్థితులను కొని తెచ్చుకోవడం దురదృష్టకరం. ప్రధానంగా జరుగుచున్న రోడ్డు ప్రమాధాలను పరిశీలిస్తే రోడ్డు నిబంధనలు పాటించకపోవడం, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ రూట్ డ్రైవింగ్, రోడ్డుపై ఉన్న గుంతలు, సరిగా లేని విండ్‌షీల్డ్ వైపర్ల వంటి అనేక కారణాలు ఉన్నాయి. ప్రతి రోజు అత్యధికంగా జరుగుచున్న రోడ్డు ప్రమాధాల నివారణ కోసం రోడ్డు భద్రతను పెంపొందించడం, నిబంధనలను పాటించడం ద్వారానే నివారించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్రమైన గాయాలు, మరణాలు, వాహనాలకు నష్టం సంభవిస్తాయి. ముఖ్యంగా వాహణ చోధకుల అజాగ్రత్త, నిర్లక్ష్యం, పరధ్యానం, నిద్రలేమి వంటివి ప్రమాధాలకు దారితీస్తాయి. అయితే నగరంలో అస్తవ్యస్తంగా మారిన రోడ్డు భద్రత, రోడ్డు నిబందనల ఉల్లంగణతో రోడ్డెక్కితే క్షేమంగా ఇంటికి తిరిగి వస్తామో, రామో తెలియని పరిస్థితి దాపురించింది. నానాటికీ ఈ సమస్య తీవ్రమవుతోంది తప్ప, చక్కదిద్దే చొరవ కన్పించడం లేదు. తెలంగాణలో రోడ్డు ప్రమాధాలను నివారించేందుకు ప్రత్యేక పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్న దశాబ్ద కాలంగా ఉన్న ప్రతిపాధన సాకారం కాకపోవడం సమస్య పరిష్కారానికి అడ్డంకిగా మారింది. నివారణకు తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై ఆరు నెలలకోసారి సంబంధిత శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించాల్సి ఉన్నాను సరైన ఎజండాపై సమీక్షలు జరగక పోవడం సమస్య జఠిలంగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి

### కార్యరూపం దాల్చని ప్రతిపాదనలు..

రోడ్డు నిబందనలపై పోలీసుశాఖ ఒక ప్రత్యేక రహదారి భద్రత విభాగాన్ని ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఎప్పటికప్పుడు రోడ్డు ప్రమాధాలు, మరణాలు, క్షతగాత్రులెందరనే లెక్కలు సేకరిస్తుంటారు తప్ప నియంత్రణకు అవసరమైన చర్యలు, అందుకు అవసరమైన వసతులు మాత్రం సమకూర్చడం పోవడం గమనార్హం. రాష్ట్ర పరిధిలో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించే లక్ష్యంతో అన్ని జాతీయ, రాష్ట్ర రహదారుల వెంట ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రతిపాదించారు. ప్రతి స్టేషన్?కు ఓ వాహనం, ఒక ఎస్సై, నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 12 మంది కానిస్టేబుళ్లు, ఎనిమిది మంది హోంగార్డులు ఉండాలని ప్రతిపాదించి సిబ్బందికి బ్రీత్ ఎనలైజర్లు, వేగాన్ని నియంత్రించే స్పీడ్‌గన్లు అందించి హైవేలపై నిరంతరం తనిఖీలు నిర్వహించడం ద్వారా ప్రమాదాలను అదుపు చేయవచ్చు అనే నిర్ణయానికి వచ్చారు. ఎక్కడైనా ప్రమాదం జరిగితే గోల్డెన్ అవర్ (గంట) లోపే అక్కడికి చేరుకొని క్షతగాత్రులకు చికిత్స అందించడం ద్వారా వారి ప్రాణాలు కాపాడేందుకు ప్రణాళికలు రూపొందించారు. మొదటి దశలో వీటి ఏర్పాటుకు, అవసరమైన సదుపాయాల కల్పనకు రూ.63 కోట్లు ఖర్చవుతాయని లెక్కలు వేశారు. కానీ ఈ ప్రతిపాదన ఇప్పటికీ కార్యరూపం దాల్చక పోవడం దురదృష్టకరం.

### నిర్లక్ష్యపు డ్రైవింగే ప్రమాధాలకు కారణం

ప్రతి రోజు ఏదో ఓ చోట ప్రమాదాలు సంభవిస్తుండగా రోడ్లు రక్తమోడుతున్నాయి ఫలితంగా రోజు రోజుకు రోడ్డు ప్రమాదాలు పెరిగి పోతున్నాయి. రోజు రోజుకు వాహనాల రద్దీ పెరగడం, మితి మీరిన వేగంతో ప్రయాణించడమే ప్రమాధాలకు ప్రధాన కారణం. రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది ప్రయాణీకుల దుర్మరణం పాలవుతుండగా మరెంతో మంది కాళ్లు, చేతులు పోగొట్టుకుని వికలాంగులుగా మారుతున్నారు. సంతోషంగా గమ్యస్థానాలకు చేరుకోవల్సిన వారు వాహణ చోధకుల నిర్లక్ష్యం, అతివేగంతో మార్గ మధ్యలోనే మృత్యు ఒడిలోకి జారుకుని, కుటుంబ సభ్యులకు గుండెకోత మిగుల్చుతున్నారు. కుటుంబాన్ని పోషించాల్సిన పెద్ద దిక్కు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబ సభ్యులను వీధిన పడేస్తున్నారు.

# రావల్ కోల్ గ్రామానికి విద్యుత్ సమస్యలు

**లైన్ మెన్ అశోక్ కి వినతిపత్రం**

**అందచేసిన సిపిఎం పార్టీ**

**విద్యుత్ సమస్యలపై ఏఈ ఉన్నతాధికారు స్పందించాలి**

**చిన్న వర్షానికే కరెంటు పోయి గ్రామాలు**

**అంధకారంలో ఉంటున్నాయి**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) రావల్ కోల్ గ్రామంలో నూతనంగా ట్రాన్స్ పారాంలను ఏర్పాటు చెయ్యాలని రావల్ కోల్ సబ్ స్టేషన్ అశోక్ కి సిపిఎం పార్టీ తరుపున వినతిపత్రం ఇచ్చి ఏఈ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.ఈ సందర్బంగా సిపిఎం పార్టీ మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ రావల్ కోల్ గ్రామంలో కరెంటు సమస్య చాలా తీవ్రంగా ఉన్నది, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాల్సిందిగా కోరారు. చిన్నపాటి వర్షాలకు, ఈదురు గాలులకు ఇలా ప్రతి చిన్న చిన్న విషయాలకు కరెంటు తీయడం అనేది సర్వసాధారణంగా మారింది, రావల్ కోల్ గ్రామం అనేది చాలా పెద్ద గ్రామం, ఈ గ్రామంలో రోజు ఏదో ఒక సమస్య కరెంటు పరంగా ఉండడం అనేది జరుగుతుంది. అలాంటి సందర్భంలో చిన్న సమస్య వల్ల ఊరు మొత్తం కరెంటు తీయడం వలన అనేక రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి, కాబట్టి విలేజ్ లో కొన్ని ట్రాన్స్ పారాంలను ఏర్పాటు చేస్తే చిన్న సమస్యకు ఊరు మొత్తం కరెంటు తీసేటటువంటి సమస్య పరిష్కారం అవుతుంది కాబట్టి వెంటనే నూతన ట్రాన్స్ పారాంలను అవసరాన్ని బట్టి ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ఏదైనా సహకారం కావాల్సి వస్తే గ్రామ ప్రజలుగా ముందుండి సహకారం చేస్తామని కూడా తెలియజేశారు.ఈ సందర్బంగా లైన్ మెన్ అశోక్ మాట్లాడుతూ ఏఈ దృష్టికి తీసుకువెళ్తామని సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ సందర్బంగా నూతనంగా ఏర్పాటు చేసే ట్రాన్సపారం వద్ద జి ఎస్ బి మెటీరియల్ కావాల్సి వస్తే సిపిఎం పార్టిగా జేసీపీఎం క్రాషర్ యాజమాన్యం అయినా సురేందర్ రెడ్డి తోని మాట్లాడగా గ్రామం కోసం ముందు వరుసలో ఉంటామని తెలియజేసి వెంటనే జి ఎస్ బి లోడ్ ని పంపించటం జరిగింది, వారికీ సిపిఎం పార్టీ తరుపున మరియు గ్రామస్తుల తరుపున ధన్యవాదములు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ కార్యదర్శి కొమురయ్య, సిపిఎం నాయకులు పూజ, హాకిమ్, గ్రామస్తులు అశోక్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు

# జెమిని 3డీ ట్రెండ్.. స్టూపిడ్ ట్రెండ్

**జెమిని 3డీతో ముప్పే**

**ఫొటో మార్ఫింగ్ పోర్నోగ్రఫీకి ఛాన్స్**

**డూప్లికేట్ ఐడెంటిటీ తయారీకి అవకాశం**

**మోసపూరితంగా లోన్లు తీసుకునే అవకాశం**

**ఫైనాన్సియల్ మోసాలకు ఆస్కారం**

**హెచ్చరిస్తున్న పోలీస్ అధికారులు**





హైదరాబాద్( ప్రశ్న న్యూస్) రోజురోజుకు పెరుగుతున్న టెక్నాలజీకి అనుకూలంగా యువత పరుగులు పెడుతుంది. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాలు వాడేవారు వాటిని వినియోగించే నేపథ్యంలో కొంతమేర నష్టాలపాలుకాక తప్పడం లేదు. తాజాగా ప్రస్తుతం జెమిని 3డీ ప్రింట్ ట్రెండింగ్ హవా కొనసాగుతున్నది. కొద్దిరోజులుగా ఎవరి మొబైల్ ఫోన్ చూసినా, వాట్సప్ స్టేటస్ ఓపెన్ చేసినా 3డీ ఇమేజ్ లు కనిపిస్తున్నాయి. అయితే ఇమేజ్ కోసం అప్ లోడ్ చేస్తున్న ఫొటోలు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. జెమిని 3డీ ట్రెండ్ స్టూపిడ్ ట్రెండ్ అంటున్నారు. ఈ విషయంలో మహిళలు, పిల్లలు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు. ఫొటోలను మార్ఫింగ్ చేసే అవకాశాలు, ఫోర్నోగ్రఫీకి కూడా వినియోగించే విధంగా ఉంటాయని హెచ్చరిస్తున్నారు. గత వారం రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా కోటికి పైగా ఫొటోలు జెమిని యాప్ లో అప్లోడ్ అయినట్లు గుర్తించారు. సోషల్ మీడియా వేదికలైన ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్ వంటి వాటిలో అప్ లోడ్ చేసిన ప్రైవసీ ఆంక్షలు ఉంటుందని జెమిని యాప్ లో అలా లేకపోవడం ప్రమాదకరమని చెబుతున్నారు. అంతేకాకుండా ఫైనాన్షియల్ మోసాలు కూడా జరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. డుప్లికేట్ ఐడెంటిటీల ద్వారా కార్ లోన్, పర్సనల్ లోన్, మెడికల్ లోన్ తీసుకునే అవకాశాలు కూడా ఉన్నాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

### వాట్సప్ డీపీలు మార్చి మోసాలు..

పెరుగుతున్న టెక్నాలజీ ప్రకారంగా సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త రూపంలో ఆన్లైన్ ద్వారా లక్షల రూపాయలు దొంగిలించుకునేందుకు ఎత్తు గడలు వేస్తున్నారు. ఈ మేరకు కొత్త కొత్త యాప్ల ఏఐ టెక్నాలజీ వాడి లక్షల్లో కొల్లగొట్టి జేబులూటీ చేస్తున్నారు. బడా బాబులతో పాటు సామాన్యులు సైతం సైబర్ నేరగాల్ల ఉచ్చులో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నారు. వాట్సాప్ డీపీలు మార్చి కాల్స్, వీడియోలు, పిడిఎఫ్ మెసేజ్లు పంపి వాటిని ఓపెన్ చేసే లోపు ఫోన్ హ్యాక్ చేసి డబ్బులు కాజేస్తున్నారు.

### రెండు ఫోన్లు వాడితేనే..

సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. రెండు ఫోన్లు వినియోగించడం మంచిదని సైబర్ నిపుణులు సలహా ఇస్తున్నారు. ఫోన్ కేవలం ఆన్లైన్ పేమెంట్స్ మాత్రమే వినియోగించుకునే విధంగా ఉండాలని సూచిస్తున్నారు. మరో ఫోన్ సోషల్ మీడియా వాడితే తద్వారా వచ్చే సైబర్ నేరగాళ్ల మెసేజ్లతో ఆర్థిక నష్టం ఉండదని సలహా ఇస్తున్నారు. ఇందులో ఏఐ ఏపీకే ఫైల్ ఇన్ స్టాల్ అయినా పెద్దగా నష్టం జరగదని సూచిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల బాధితుల్లో మెసేజ్ లతో నష్టపోయినవారే ఎక్కువ సంఖ్యలో ఉండటం గమనార్హం. మనం ఇంటర్నెట్లో షేర్ చేసే సమాచారం మరియు వ్యక్తిగత డేటా మనకు తెలియకుండానే ఉపయోగించబడుతుంది అనే దాని గురించి ఎఐ వివరిస్తుంది. ఎఐ సహాయంతో మీ ఫోటోలు మరియు వీడియోల నుండి మీ డిజిటల్ రూపాన్ని (డిజిటల్ అవతార్) సృష్టించి ఈ డిజిటల్ అవుతారు. మీ స్నేహితులు లేదా కుటుంబ సభ్యులను మోసం చేయడానికి లేదా ఆర్థిక లావాదేవీలు చేయడానికి కూడా ఉపయోగించవచ్చు. దీనినే గుర్తింపు దొంగతనం (ఐడెంటిటీ తెఫ్ట్) అంటారు. మోసగాళ్లు ఆ డిజిటల్ రూపాన్ని వాణిజ్య ప్రకటనలకు, అసాంఘిక కార్యకలాపాలకు లేదా ఇతర నేరాలకు ఉపయోగించుకునే అవకాశం ఉంది.

### ముఖ్య విషయాలు..

మీ ముఖం మాత్రమే కాదు, మీ శరీరం, మీ ముఖం మరియు శరీరం యొక్క డిజిటల్ రూపాలు (డిజిటల్ అవతార్స్) తయారు చేసి, వాటిని వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తారు. వ్యక్తిగత డేటా భద్రత... మీ పేరు, ఫోటోలు, చిరునామా, ఆస్తులు, మరియు ఇతర వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కావచ్చు.

### ఎఐ (కృత్రిమ మేధస్సు) ఉపయోగం..

కృత్రిమ మేధస్సుని ఉపయోగించి మీ డిజిటల్ రూపాలను తయారు చేస్తారు. వీటితో మీకు తెలియకుండానే డ్రగ్స్ అమ్మేవాళ్లు, లేదా అసాంఘిక కార్యకలాపాలు చేసే వాళ్ల కూడా మీ రూపాన్ని వాడుకోవచ్చు.

## హెచ్చరిక

ఈ ప్రపంచం మొత్తం మాయలాంటిది. ఇక్కడ డేటాను నమ్మడం చాలా ప్రమాదకరం. మీ వ్యక్తిగత సమాచారం పంచుకునే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవడం మంచిది. ఇంటర్నెట్లో చాలా అప్రమత్తంగా ఉండాలి. వ్యక్తిగత డేటాను జాగ్రత్తగా చూసుకోవాలి

# జిహెచ్ఎంసి సర్కిల్ -18 ఏసిపి గా తల్లోజు రమేష్ కుమార్ భాధ్యతలు

**అక్రమ నిర్మాణాలను చేపడితే ఉపేక్షించేది లేదు**

**కిందిస్థాయి సిబ్బందిని పూర్తి క్రమశిక్షణలో పెట్టి ఇన్నాళ్లు**

**సర్కిల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలను చెక్ పెడతా**



ఖైరతాబాద్(ప్రశ్న న్యూస్) జిహెచ్ఎంసి సర్కిల్ -18 జూబ్లీహిల్స్ టౌన్ ప్లానింగ్ ఏసిపి (అసిస్టెంట్ సిటీ ప్లానర్) గా తల్లోజు రమేష్ కుమార్ సోమవారం నాడు భాధ్యతలు స్వీకరించారు. ఉన్నతాధికారులు చేపట్టిన బదిలీల్లో ఇక్కడ ఉన్న ఇంజ శ్రీనివాస్ ను బేగంపేట సర్కిల్ కు బదిలీపై వెళ్ళగా, ఆయన స్థానంలో తల్లోజు రమేష్ కుమార్ చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ సర్కిల్ 18 లో అక్రమ నిర్మాణాలు చెపడితే సహించేది లేదని, అవసరమనుకుంటే అక్రమ నిర్మాణదారుల మీద కేసులు కూడా నమోదు చేస్తామని అక్రమ నిర్మాణదారులను హెచ్చరించారు. ఎవరైనా సరే ఎంతటి వారైనా సరే జిహెచ్ఎంసి నియమ నిబంధనలను అనుసరిస్తూ భావన నిర్మాణాలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## పారిశ్రామికవేత్తలు పారిపోయే పరిస్థితి

# తీసుకురావొద్దు: పవన్ కల్యాణ్



అమరావతి (ప్రశ్న న్యూస్) పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అదే సమయంలో పరిశ్రమల అభివృద్ధికి అడ్డుపడే విధంగా వ్యవహరించకూడదని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పర్యావరణ, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శులతో అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదే క్రమంలో టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేసిన ఆరోపణలపైనా మరోసారి సమీక్షించారు.పీసీబీ (కాలుష్య నియంత్రణ మండలి) కీలక భూమిక పోషించాలన్న ఉద్దేశంతో ఇప్పటికే దిశానిర్దేశం చేసినట్లు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పీసీబీని అడ్డుపెట్టుకొని వ్యక్తిగత ప్రయోజనాలు పొందాలనుకునే వారిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిశ్రమలకు అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటూనే, కాలుష్య నియంత్రణ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ఆయన ఆదేశించారు.“పెట్టుబడులు వచ్చేలా ప్రోత్సహించాలి.

కానీ పారిశ్రామికవేత్తలు భయపడి పారిపోయే పరిస్థితులు రాకూడదు” అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గతంలో జరిగిన ఎల్జీ పాలిమర్స్ వంటి ప్రమాదాలు మళ్లీ జరగకూడదని, ప్రజల ప్రాణాలకు ముప్పు వచ్చే స్థితిని సహించేది లేదని హితవు పలికారు.విశాఖపట్నం ప్రాంతంలో ఉన్న ఫార్మా సంస్థలపై పర్యవేక్షణ పెంచాలని, కాలుష్య నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని సూచించారు. పీసీబీ సిబ్బంది పనితీరుపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. భావితరాలకు శుభ్రమైన గాలి, నీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588